ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

## పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -113 పేజీలు - 8 వెల - 03/- సోమవారం 10 ఆగస్టు 2026



# గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

- విజయవాడలో కార్యక్రమం... హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సీఎం పిలుపు
- జీవో నెంబర్ 3ను చట్టపరంగా కాపాడతామని ఆదివాసులకు భరోసా
- అరకు కాఫీ తరహాలో స్థానిక గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్

**అమరావతిఆగస్టు 9:( పబ్లిక్ న్యూస్)**
అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వృత్తిలో విజయం సాధించి, సమాజానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్బోధించారు. ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభకు చంద్రబాబు ముఖ్య

మిగతా 2లో.



స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా'
# కొత్త శక్తినిచ్చింది

- క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందన్న ప్రధాని
- ఉద్యమకారుల ధైర్యసాహసాలు, త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య
- 'డూ ఆర్ డై' సంకల్పాన్ని దేశప్రజల్లో నింపిందని గుర్తు చేసుకున్న అమిత్ షా
- ఉద్యమకారులకు నివాళులర్పించిన ప్రధాని, కేంద్ర హోంమంత్రి, యూపీ సీఎం



**ఢిల్లీ ఆగస్టు 9:( పబ్లిక్ న్యూస్)**
చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య సంగ్రామానికి కొత్త శక్తిని అందించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఉద్యమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. వారి ధైర్యసాహసాలు, త్యాగాలు రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ప్రధాని పేర్కొన్నారు.ఆగస్టు విప్లవంలో పాల్గొన్న నేతలను, సమరయోధులను స్మరించుకుంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "మహాత్మా గాంధీ నాయకత్వ స్ఫూర్తితో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం

మిగతా 2లో.

# మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి

- మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లగా ఘటన
- పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని మమత ఆరోపణ
- దాడిని ఖండించిన బీజేపీ, తమకు సంబంధం లేదని వెల్లడి
- మరణాన్ని రాజకీయం చేస్తున్నారంటూ మమతపై సువేందు అధికారి విమర్శ



**కోల్‌కతా ఆగస్టు 9:( పబ్లిక్ న్యూస్)**
పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న కారుపై నిరసనకారులు దాడికి పాల్పడ్డారు. కోల్‌కతా సమీపంలోని ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆమె కాన్వాయ్‌పై కొందరు రాళ్లు, ఇటుకలు, వాటర్ బాటిళ్లు విసిరారు.

మిగతా 2లో.

పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి
# కేసీఆర్ పరామర్శ..



- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత
- నల్లబెల్లిలో దివంగత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ
- హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్
- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం చెక్కులు అందజేత
- సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగం
- పార్టీ అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా

**నర్సంపేట ఆగస్టు 9:( పబ్లిక్ న్యూస్) :** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ప్రకటించిన రూ. 2. 25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా

మిగతా 2లో.

రాజమండ్రి ఘటనలో గాయపడిన
# ప్రియాంక మృతి

- సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన వైనం
- మరణాన్ని ధ్రువీకరించిన వైద్యులు
- ప్రమాదానికి కారణమైన ఇద్దరు నిందితులు ఇప్పటికే అరెస్ట్



**హైదరాబాద్ ఆగస్టు 9:( పబ్లిక్ న్యూస్)**
రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికో ప్రియాంక మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఓ వైద్యురాలిగా ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రియాంక అర్థాంతరంగా తనువు చాలించడంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

మిగతా 2లో.

# క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- మంత్రులకు లోకేశ్ కీలక ఆదేశాలు
- 14 రోజుల్లో 40 లక్షల కుటుంబాలను కలిసిన టీడీపీ శ్రేణులు
- కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరణ




2లో.

# బస్సులారీ ఢీ..

## 35 మందికి గాయాలు!

- పామిడి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు.. 15 మంది పరిస్థితి విషమం
- బ్రిడ్జిపై నుంచి కిందకు పడిన వాహనాలు



2లో.

# నేటితో సర్ ఆఖరు

- హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?.. ఓటర్ల జాబితా సర్వేతో భారీ మార్పులు!
- సుమారు 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగింపు అంచనా
- సొంతూరిలో ఓటు హక్కుకే వలసదారుల మొగ్గు
- సనత్‌నగర్‌లో అత్యధికంగా 45శాతం ఓట్ల రద్దుకు అవకాశం
- ఆగస్టు 17న విడుదల కానున్న ముసాయిదా ఓటర్ల జాబితా




2లో.

# గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**మొదటిపేజీ తరువాయి**

అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... గిరిజన సమాజానికి సమగ్ర అభివృద్ధి, సంక్షేమంపై పలు కీలక హామీలు ఇస్తూ, వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.

సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టి, అనేక కష్టాలను అధిగమించి, దేశ ప్రథమ పౌరురాలిగా అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చంద్రబాబు అన్నారు. ఆమె స్ఫూర్తితో గిరిజన యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. జాతీయ జెండాతో పాటు మీ అజెండా కూడా ఉండాలని పిలుపునిచ్చారు. “సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. ద్రౌపది ముర్ము, అబ్దుల్ కలాం, బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, నరేంద్ర మోదీ వంటి మహనీయులంతా సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. ‘నేను ఏంటి? ఎలా ఎదగాలి? ఈ సమాజానికి, దేశానికి నేనేం ఇవ్వాలి?’ అనే లక్ష్యంతో పనిచేయాలి. మీ విజయం దేశ విజయమవుతుంది..“ అని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తిని వ్యాపింపజేసేందుకు ఆగస్టు 9 నుంచి 15 వరకు ‘అనే నేను‘ పేరుతో ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

### గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్.. అరకు కాఫీ ఒక సక్సెస్ స్టోరీ

గిరిజన ప్రాంతాల్లోని ఆర్థిక స్వావలంబనపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాను 25 ఏళ్ల క్రితం ఒక చిరు ప్రయత్నంగా ప్రారంభించిన అరకు కాఫీ, నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచడాన్ని ఆయన గుర్తుచేశారు. “అరకు కాఫీకి నేనే పేరు పెట్టాను. దానిని మార్కెటింగ్ చేసి, ప్రధాని నరేంద్ర మోడీ నుంచి ఆస్ట్రేలియా ప్రధాని వరకు బహుకరించి, గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టాను. ఇవాళ పారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాళ్లు ఉన్నాయి“ అని గర్వంగా ప్రకటించారు.

ఇదే స్ఫూర్తితో సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లం వంటి స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించి, బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సంస్థలతో 19 అవగాహన ఒప్పందాలు



(ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు.

**మౌలిక వసతులు, విద్య, వైద్యానికి పెద్దపీట**

గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి నాలుగు కీలక రంగాలపై దృష్టి పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, ఆదాయ మార్గాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

మౌలిక వసతులు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో 2,336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్ కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. ‘జల్ జీవన్ మిషన్‘ కింద 2027 డిసెంబర్ నాటికి ప్రతి గిరిజన ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాలకు సైతం టెలికాం కనెక్టివిటీ అందించి, డోలీ మోతలు లేని సమాజాన్ని నిర్మిస్తామన్నారు.

విద్య: ‘తల్లికి వందనం‘ కింద 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులకు రూ.650 కోట్లు అందించామని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. విశాఖలోని మేకవారిపాలెంలో 600 మంది విద్యార్థులతో ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‘ ఏర్పాటు చేసి, ఐఐటీ వంటి జాతీయ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటా కనీసం 100 మంది గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి సంస్థల్లో సీట్లు సాధించడమే లక్ష్యమన్నారు.

వైద్యం: పాడేరులో మెడికల్ కాలేజీతో పాటు పార్వతీపురం, రంపచోడవరం, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తామన్నారు. ‘సంజీవిని‘ ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తామని, సికిల్ సెల్ అనీమియా బాధితులకు రూ.10,000 పింఛను అందిస్తూ, వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రకటించారు.

**జీవో నెంబర్ 3 పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం**

గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానికులకే దక్కాలనే ఆశయంతో ఎన్టీఆర్ హయాంలో పురుడుపోసుకుని, తాను 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ను కాపాడతామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టులో ఈ జీవోను కొట్టివేయడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. “ఈ జీవోను చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా నిలబడేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తాం. ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆవేశంతో కాకుండా ఆలోచనతో, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై ముందుకు వెళతాం“ అని భరోసా ఇచ్చారు.

గిరిజన ప్రాంతాలను కేవలం వెనుకబడిన ప్రాంతాలుగా కాకుండా, అపార అవకాశాలున్న ప్రాంతాలుగా చూస్తున్నామని, అక్కడి పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఉపయోగించుకుని టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రతి గిరిజన ఇల్లు ‘అతిథి గృహం‘గా మారాలని, తద్వారా ప్రపంచానికి ఆతిథ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి ‘వికసిత్ భారత్‘, ‘స్వర్ణాంధ్రప్రదేశ్‘ లక్ష్యాలను సాధించడంలో ఆదివాసీలు కీలక పాత్ర పోషించాలని, వారి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# రాజమండ్రి ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

**మొదటిపేజీ తరువాయి**

వివరాల్లోకి వెళితే, ఆగస్టు 3వ తేదీన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ ప్రాంతంలో ప్రియాంక తన స్కూటర్‌పై వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన సురవరపు దశ్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు యువకులు ఆమె స్కూటర్‌ను ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రియాంక తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రాజమండ్రిలోని స్థానిక ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు.

అక్కడ ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆమె కోలుకోలేకపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3:25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్టు కిమ్స్ వైద్యులు ప్రకటించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులు దశ్వంత్, ఆండ్రూలను ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

కాగా, తన కుమార్తె మృతికి కారణమైన వారిపై సాధారణ ప్రమాద కేసు కాకుండా, హత్య కేసు నమోదు చేయాలని ప్రియాంక తండ్రి డిమాండ్ చేశారు. ఇది కేవలం ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యేనని ఆయన ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా సీసీటీవీ ఫుటేజి పరిశీలించిన అనంతరం, కావాలనే ఢీకొట్టినట్టు గుర్తించారు. హత్యాయత్నం సెక్షన్లతో కేసును మరింత పకడ్బందీగా మార్చారు. ప్రియాంక స్వస్థలం తెలంగాణలోని గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్ పూర్. ఆమె ఎంబీబీఎస్ అనంతరం రాజమండ్రిలో పీజీ చేస్తోంది. ఇప్పుడు ఆమె మృతితో స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

### మెడికో ప్రియాంక కుటుంబానికి రూ.20 లక్షల సాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు

రాజమండ్రిలో కారు ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆమె మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని, ఈ ఘటన అత్యంత విషాదకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి తక్షణమే రూ. 20 లక్షల సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై తాను ఇప్పటికే జిల్లా అధికారులతో సమీక్షించానని గుర్తుచేశారు. ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ కేసులో నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి జైలుకు పంపినట్టు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, నిర్లక్ష్యంగా వ్యవహరించి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న వారికి కఠిన శిక్ష పడేలా బలమైన సెక్షన్లు నమోదు చేయాలని సూచించారు.

# బస్సులారీ ఢీ.. 35 మందికి గాయాలు!

**పామిడి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం**

**ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు.. 15 మంది పరిస్థితి విషమం**

**బ్రిడ్జిపై నుంచి కిందకు పడిన వాహనాలు**

**పామిడి, ఆగస్టు 9:( పబ్లిక్ న్యూస్)**

పామిడి మండలంలోని పొగరూరు గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేట్ బస్సు, ఐచర్ లారీ ఢీకొనడంతో అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 35 మంది ప్రయాణికులు గాయపడగా.. వారిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

హైదరాబాద్ నుంచి బెంగళూరుకు సుమారు 35 మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పొగరూరు సమీపంలోని 44వ జాతీయ రహదారిపైకి చేరుకుంది. అదే సమయంలో వచ్చిన ఐచర్ లారీని బస్సు ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురై కేకలు వేయడంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది.

**క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు**

సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో బస్సులో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మొత్తం 35 మంది ప్రయాణికులకు



చికిత్స అందించగా.. 15 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

**క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్లు**

ప్రమాద తీవ్రతకు రెండు వాహనాల క్యాబిన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇద్దరు డ్రైవర్లు క్యాబిన్లలో ఇరుక్కుపోవడంతో పోలీసులు, సహాయక సిబ్బంది గ్యాస్ కట్టర్ల సాయంతో వాహన భాగాలను తొలగించి వారిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు డ్రైవర్లను కూడా మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు.

**నిద్రమత్తే కారణమా?**

అతివేగంగా ప్రయాణించడం, డ్రైవర్లు నిద్రమత్తులోకి వెళ్లడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎవరూ మృతి చెందలేదని, క్షతగాత్రులందరికీ వైద్య చికిత్స అందుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# స్వాతంత్ర్య పోరాటానికి ‘క్విట్ ఇండియా‘ కొత్త శక్తినిచ్చింది

**మొదటిపేజీ తరువాయి**

మన స్వాతంత్ర్య పోరాటానికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. వలస పాలన నుంచి విముక్తి పొందాలన్న మన ప్రజల అచంచల సంకల్పాన్ని ఇది ప్రతిబింబించింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ స్మరించుకుంటున్నాను. వారి ధైర్యం ప్రతి భారతీయుడికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే“ అని మోదీ తన సందేశంలో తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా క్విట్ ఇండియా ఉద్యమకారులకు నివాళులర్పించారు. ఈ ఉద్యమం దేశప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిందని, ‘డూ ఆర్ డై‘ (చేయండి లేదా చావండి) అనే సంకల్పాన్ని, అద్వితీయమైన ధైర్యాన్ని వారిలో నింపిందని ఆయన గుర్తు చేసుకున్నారు. జాతి ప్రయోజనాలకు ప్రథమ స్థానం ఇస్తూ, స్వదేశీని ప్రోత్సహిస్తూ ఆత్మనిర్భర్, వికసిత భారత్ లక్ష్యాల కోసం పనిచేయడానికి ఈ రోజు స్ఫూర్తినివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం ఉద్యమకారుల ధైర్యాన్ని, త్యాగాలను స్మరించుకున్నారు. ‘డూ ఆర్ డై‘ నినాదంతో సమరయోధులు జాతీయ చైతన్యాన్ని రగిలించి స్వాతంత్ర్య పోరాటానికి ఒక నిర్ణయాత్మక దిశను చూపారని ఆయన పేర్కొన్నారు. 1942 ఆగస్టు 8న బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ‘క్విట్ ఇండియా‘ తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత ఈ ఉద్యమం ప్రారంభమైంది. అప్పుడు మహాత్మా గాంధీ ‘డూ ఆర్ డై‘ అనే చారిత్రాత్మక పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాలన అంతం కావాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం కఠినంగా అణిచివేసినప్పటికీ, దేశవ్యాప్తంగా నిరసనలు, సమ్మెలు వెల్లువెత్తాయి. భారత స్వాతంత్ర్య పోరాట తుది దశలో ఇది ఒక మహోద్యమంగా నిలిచింది.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ..

**మొదటిపేజీ తరువాయి**



సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నల్లబెల్లిలోని నివాసానికి చేరుకున్న కేసీఆర్, తొలుత సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంచి నేత అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల పేరున చెరో రూ.1 కోటి, ఆయన తల్లి అమృతమ్మ సంరక్షణ కోసం రూ.25 లక్షల చెక్కులను కేసీఆర్ అందించారు. పిల్లల చదువులు, భవిష్యత్తుతో పాటు కుటుంబ సంక్షేమ బాధ్యతలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

కేసీఆర్ రాక సందర్భంగా నల్లబెల్లికి బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జనం కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చి కేసీఆర్ కాన్వాయ్‌కు దారి కల్పించారు. కేసీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి

**మొదటిపేజీ తరువాయి**

పోలీసు కస్టడీలో మరణించినట్లు భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్త బిర్జూ కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. దోపిడీ ఆరోపణలపై అరెస్టయిన బిర్జూ, పోలీసుల కస్టడీలో మరణించాడు. ఈ నేపథ్యంలో, మమత పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఆమె కారును చుట్టుముట్టి, దానిపై బురద పూశారు. “చోర్ భగావో“ (దొంగను తరిమేయండి) అంటూ నినాదాలు చేశారు.

ఈ దాడిపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పోలీసుల సమక్షంలోనే గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనంపై రాళ్లతో దాడి చేశారని ఆమె ఆరోపించారు. “కారు అద్దాలు మూసి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాను. లేదంటే ఆ రాళ్లు తలకు తగిలి నా తల పగిలిపోయేది“ అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, వారు కేవలం అధికార బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఆమెతో పాటు ఉన్న లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా అధికారుల వైఫల్యాన్ని విమర్శించారు. ఈ ఘటనను రాష్ట్ర బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ఖండించారు. ఈ దాడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. అయితే, సీఎం సువేందు అధికారి దీన్ని మమత సృష్టించిన డ్రామాగా అభివర్ణించారు. కస్టడీ మరణాన్ని రాజకీయం చేసేందుకే మమత బలవంతంగా ఆ ప్రాంతానికి వెళ్లారని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులు అధికారుల తీరుపై సంతృప్తి చెందారని, మరణానికి కచ్చితమైన కారణం తెలియాలని మాత్రమే వారు కోరుకుంటున్నారని తెలిపారు. తన పర్యటనతో మమత ప్రజా జీవితానికి ఆటంకం కలిగించారని విమర్శించారు.

ఇటీవలే మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై కూడా ఆయన నియోజకవర్గంలో దాడి జరిగిన నేపథ్యంలో, తాజా ఘటనతో రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి

# నేటితో సర్ ఆఖరు

**హైదరాబాద్ ఆగస్టు 9:( పబ్లిక్ న్యూస్)**

రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే (౹×=) కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**సనత్‌నగర్‌లో సగానికి పైగా ఓట్లు రద్దు!**

ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇది అత్యధికంగా ఉంది. ముఖ్యంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,030 ఓట్లు ఉండగా, వాటిలో ఏకంగా 1.16 లక్షల ఓట్లు (45.68%) రద్దయ్యే అవకాశం ఉందని అంచనా. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో 44.21%, ఎల్బీనగర్‌లో 42.19%, ఉప్పల్‌లో 40.05%, మహేశ్వరంలో 40.03% ఓట్లు జాబితా నుంచి తొలగిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 21.43% ఓట్లు రద్దయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్యల్లో స్వల్ప మార్పులు మాత్రమే ఉండొచ్చని భావిస్తున్నారు.

**ఓట్ల తొలగింపునకు కారణాలేంటి?**

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది హైదరాబాద్‌కు వలస వస్తుంటారు. ఇక్కడే స్థిరపడి ఓటరుగా నమోదు చేసుకుంటారు. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు సర్వే జరుగుతున్న నేపథ్యంలో.. సొంత ఊరితో పాటు హైదరాబాద్‌లోనూ ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటును సొంతూరిలోనే కొనసాగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగరంలో ఎన్యుమరేషన్ ఫారాలను చాలామంది అధికారులకు తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. ఇదే ఓట్ల సంఖ్య భారీగా తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

మరోవైపు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని లక్షలాది మంది ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారంతా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సోమవారం గడువు ముగిసిన తర్వాత తుది లెక్కలు తేలనుండగా, ఆగస్టు 17న వెలువడనున్న ముసాయిదా జాబితాపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**మంత్రులకు లోకేశ్ కీలక ఆదేశాలు**

**అమరావతిఆగస్టు 9:( పబ్లిక్ న్యూస్)**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ‘ఇంటింటికీ తెలుగుదేశం 2 ఏళ్ల నమ్మకం‘ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని, సంక్షేమ ఫలాలను ప్రజలకు నేరుగా వివరించే ఈ కార్యక్రమం ఆదివారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. గడిచిన 14 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు 40.74 లక్షలకు పైగా కుటుంబాలను నేరుగా కలుసుకుని రికార్డు సృష్టించాయి. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనతో ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3.53 లక్షల ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ‘సూపర్ సిక్స్‘ హామీల అమలు తీరును, ఇతర సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందుతున్న ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి వివరిస్తున్నారు.

ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ఆయన పార్టీ శ్రేణులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో తప్పనిసరిగా పర్యటించాలని, ప్రజలతో మమేకమై ప్రభుత్వ విజయాలను వివరించాలని స్పష్టం చేశారు. క్లస్టర్, మండల స్థాయి నాయకులను ఫోకస్ బూత్‌లకు అనుసంధానించి, సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి గ్రామ స్థాయి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో సమష్టిగా పాల్గొంటున్నారని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పటిష్ఠం చేయాలని టీడీపీ భావిస్తోంది.

ప్రజా రిపబ్లిక్

సోమవారం 10 ఆగస్టు 2026

# గిరిజనుల సంక్షేమం, విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత



**గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, గృహ వసతి, విద్య, ఉపాధి సమస్యల పరిష్కారానికి సమగ్ర చర్యలు**

**గిరిజన యువత ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధితో స్వయం సాధికారత సాధించాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**






**నంద్యాల బ్యూరో, ఆగస్టు 09 (రిపబ్లిక్ న్యూస్):** గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, వారి సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజనుల సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా 46 గిరిజన కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేయడంతో పాటు, ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గిరిజనుల విజ్ఞప్తి మేరకు అమ్మవారి ఆలయం, కొత్త ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు పాత పాఠశాల భవనాన్ని నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని, గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అందించే పథకాలు, సేవలు అర్హులైన వారికి చేరేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### గిరిజన విద్యకు అత్యంత ప్రాధాన్యత

గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి కెరీర్‌ను నిర్మించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏ విభాగంలో డిగ్రీ పూర్తి చేసినా పోటీ పరీక్షలకు హాజరయ్యే అవకాశాలు లభిస్తాయని, అందువల్ల విద్యార్థులు డిగ్రీ విద్యను పూర్తి చేయడంతో పాటు నిరంతర సాధన, క్రమశిక్షణతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలను చదవడమే కాకుండా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, కొమరం భీమ్, బిర్సా ముండా వంటి మహనీయుల జీవితాలను తెలుసుకుని వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. ఆటలు, పాటలు, పుస్తక పఠనం, లైఫ్ స్కిల్స్ వంటి పాఠ్యేతర కార్యకలాపాల్లోనూ విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని, తద్వారా నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. జిల్లాలోని 9 ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, 13 ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న వసతులను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సూచించారు. గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం, డెప్యుటేషన్ల రద్దు, మౌలిక వసతుల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. తరగతి గదులు, వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పాఠశాలల వారీగా గుర్తించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. అన్ని ఆశ్రమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు గతంలోనే ప్రాధాన్యత ఇచ్చామని, అనేక చోట్ల పనులు పూర్తయ్యాయని లేదా తుది దశలో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించి తమ లక్ష్యాలను సాధించాలని, బాల్య వివాహాల వైపు దృష్టి మళ్లించకుండా విద్య, ఉద్యోగం, స్వయం సాధికారతపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు.

### తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం, దీర్ఘకాలిక పొడి వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రానున్న రోజుల్లో తాగునీటి సమస్య తీవ్రతరం కాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. రిజర్వాయర్లలో లభ్యమయ్యే నీటికి తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. నీటి కొరత దృష్ట్యా రైతులు అధిక నీటి అవసరం కలిగిన వరి వంటి పంటల సాగుకు దూరంగా ఉండాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న సుమారు 40 గ్రామాలను గుర్తించి, నీటి ఎద్దడి నివారణ పనులకు ఇప్పటికే నిధులు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎల్.కె. తండా, సుగాలి మెట్ట తదితర ప్రాంతాల్లోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించి పనులను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు.

### గిరిజన భవన్‌కు స్థల పరిశీలన

జిల్లా కేంద్రంలో గిరిజన భవన్ ఏర్పాటు చేయాలన్న గిరిజన సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. నంద్యాల పట్టణ పరిధిలో ప్రభుత్వ భూమి లభ్యత పరిమితంగా ఉండటం, అందుబాటులో ఉన్న కొన్ని భూములు నీటి వనరులకు సంబంధించినవి కావడంతో న్యాయస్థానాల మార్గదర్శకాలను అనుసరించాల్సి ఉందని తెలిపారు. అందువల్ల నంద్యాల రూరల్, పాణ్యం రూరల్, మహానంది తదితర పట్టణానికి సమీప ప్రాంతాల్లో అనువైన స్థలాన్ని పరిశీలించి గిరిజన భవన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. శ్రీశైలంలోని మూసివేసిన ఎస్టీ హాస్టల్ భవనాన్ని స్వయంగా పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టి నిబంధనల మేరకు తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

### గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు

గిరిజన మహిళలు తయారు చేసే వెదురు బుట్టలు, ఆభరణాలు, ఆకులతో తయారు చేసే విస్తరాకులు, కప్పులు, తేనె తదితర ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే వారికి స్థిరమైన ఆదాయం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ వద్ద వెదురుతో ప్రత్యేకంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, గిరిజన మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను అక్కడ ప్రదర్శించి నేరుగా విక్రయించడంతో పాటు బల్క్ ఆర్డర్లు పొందేలా అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ సదుపాయం త్వరలో అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

### చెంచు, పీవీటీజీ కుటుంబాలకు గృహ నిర్మాణానికి ప్రోత్సాహం

ప్రత్యేకంగా బలహీన గిరిజన తెగల (పివి టీజీ) కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా మరింత మెరుగైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. పీఎం జన్మన్ పథకం కింద బైర్లూటీ, పాణ్యం కాలనీ, శ్రీశైలం మేకలబండ తదితర ప్రాంతాల్లో సుమారు 570 ఇళ్లు మంజూరయ్యాయని వెల్లడించారు. అర్హులైన పీవీటీజీ కుటుంబాలకు గృహ నిర్మాణానికి ప్రభుత్వ నిబంధనల మేరకు ఆర్థిక సహాయం అందుతుందని, మిగిలిన లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించేలా అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు చొరవ చూపాలని కోరారు.

### భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

రీ-సర్వే, డాటెడ్ ల్యాండ్స్, 22-ఏ తదితర భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ప్రతి చిన్న సమస్య కోసం జిల్లా స్థాయి అధికారుల వరకు రావాల్సిన అవసరం లేకుండా ఆర్‌డీఓ స్థాయిలోనే ఎక్కువ సమస్యలు పరిష్కారమయ్యేలా నిబంధనల్లో మార్పులు చేసినట్లు చెప్పారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు, పాస్‌బుక్‌లకు సంబంధించి వారసులకు ఎదురవుతున్న సమస్యలను ఐటీడీఏ ద్వారా పరిష్కరించి పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెంచు లక్ష్మిగూడెం వద్ద మిగిలిన 17 ఎకరాల భూమికి ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు, బోర్లు మంజూరు చేసి ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం అందించినట్లు వివరించారు. నాగార్జునసాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. అటవీ సంరక్షణకు సంబంధించిన నిబంధనలను ప్రజలు, అధికారులు సమష్టిగా పాటించాలని సూచించారు. చెంచు, ఇతర గిరిజన కుటుంబాలకు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, ఐటీడీఏ ద్వారా అవసరమైన సహాయం, మార్గదర్శకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఐటీడీఏకు సంబంధించిన పాత ఫిర్యాదులు, విచారణలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌తో సమన్వయం మరింత మెరుగుపరచేందుకు ముగ్గురు డీఎఫ్‌ఓలతో త్వరలో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో స్మశాన వాటికలకు స్థల సమస్యను పరిష్కరించేందుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి, హిల్ పోరంబోకు భూములను పరిశీలించి అవసరమైన చోట్ల స్థానిక సంస్థలకు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. స్మశాన వాటికలకు వెళ్లే మార్గంలో వాగులు దాటాల్సి వస్తున్న ప్రాంతాల్లో అవసరమైన వంతెనలు, కల్వర్టుల నిర్మాణానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను కలెక్టర్ అభినందించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలో వారి ప్రతిభ, ఉత్సాహం, భావ వ్యక్తీకరణను ప్రశంసిస్తూ, వారికి శిక్షణ అందించిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి, సోషల్ వెల్ఫేర్ డిడి, గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఆదివాసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అభివృద్ధి చెందాలి**

**చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు**

**గిరిజనుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్న కూటమి ప్రభుత్వం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 9)** ఆదివాసీలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సూచించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలులోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, గిరిజన నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధులు, నాయకుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించిందని, ప్రపంచంలోని 93 దేశాల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం ఆదివాసీలకు సమాన హక్కులు, ఓటు హక్కు కల్పించడంతో పాటు వారి అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గతంతో పోలిస్తే గిరిజన విద్యారంగంలో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. జిల్లాలోని గిరిజన పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 80 మంది బాలికలకు 80 మంది ఉత్తీర్ణత సాధించగా, 52 మంది బాలురలో 51 మంది ఉత్తీర్ణత సాధించారని, మొత్తంగా 99.24 శాతం ఉత్తీర్ణత నమోదైందని వెల్లడించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై నెలకు సుమారు రూ.10 వేల వరకు ఖర్చు చేస్తూ విద్యను అందిస్తోందన్నారు. గిరిజన సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఇంటర్నెట్, చాట్‌జీపీటీ, మెటా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక సాధనాలను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. వ్యాపార అభివృద్ధికి అవసరమైన సమాచారాన్ని కూడా సాంకేతికత ద్వారా తెలుసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు.

### గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత: ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధి కోసం ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు.

గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో చేపట్టిన 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా మారుమూల గిరిజన ప్రాంతాలకు రహదారి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

అత్యవసర వైద్యం, ప్రసవ సమయాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. పాణ్యం నియోజకవర్గంలోని గిరిజనులు అధికంగా నివసించే ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ప్రతి మండలంలోని తండాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

ఓర్వకల్లు మండలంలోని గుమితం తండాలో ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, పరిశ్రమల నుంచి లభించే సీఎస్ఆర్ నిధులను గిరిజన ప్రాంతాల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇళ్లు, రహదారులు, వాటర్ ట్యాంకులు, పాఠశాలలు తదితర అవసరాలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు.

గిరిజనుల భూ, రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు అర్హులైన రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

### గిరిజన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా 16,347 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి అర్హత, మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు చిన్న వయస్సులోనే తమకు నచ్చిన రంగంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. దురలవాట్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని, రాజ్యాంగబద్ధంగా లభిస్తున్న రిజర్వేషన్, సంక్షేమ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు.

గిరిజన ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే వ్యవసాయ, అటవీ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించి గిరిజనుల ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అరకు కాఫీకి దేశవ్యాప్తంగా మరింత ప్రచారం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గిరిజన బాలికలకు విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి హాస్టల్ సదుపాయం కల్పించాలన్న విజ్ఞప్తిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





### ఆకట్టుకున్న గిరిజన విద్యార్థుల ప్రతిభ

కార్యక్రమంలో గిరిజన బాలికా విద్యార్థులు ఆంగ్ల వ్యాకరణంలోని వివిధ క్రియలను వివరించడంతో పాటు మహాభారతంలోని కౌరవుల వంద మంది పేర్లను చెప్పి ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి సురేష్ జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, విద్యార్థుల కోసం అమలు చేస్తున్న చర్యలను వివరించారు. గిరిజన నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి గిరిజనులకు అందాల్సిన సేవలను త్వరితగతిన అందించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సలహా మండలి సభ్యులు పి. వెంకటపతి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ నాయక్, రాగిరి చంద్రప్ప, గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, ఎరుకుల రాజు, ఎరుకుల హక్కుల పోరాట సమితి యోగేష్ నాయక్, జాతీయ లంబాడి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ మహేంద్ర నాయక్, ఎస్టీ మోర్చా జాతీయ కార్యదర్శి మధు నాయక్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ గిరిజన నాయకులు మోపిరి సూర్య, కుశాల్, సేవాలాల్ నాయక్, గుండాల్ నాయక్, సోమ్లా నాయక్, శశాంక్, మద్దిలేటి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, శ్రీరాములు నాయక్, సురేష్, రాఘవేంద్ర, శ్రీరామరాజు తదితరులు పాల్గొన్నారు.

# బిందెడు నీళ్ల కోసం కటకట పొలాల్లోని బోరుబావి వద్దకు దళిత మహిళలు.

**రైల్వే కోడూరు ఆగస్టు 9 రిపబ్లిక్ న్యూస్.**

సకాలంలో వర్షాలు పడక వర్షాభావ పరిస్థితి ఏర్పడి అరుంధతివాడలో నాలుగు రోజులుగా తాగునీటి ఎద్దడి ఏర్పడిబిందెడు నీటి కోసం కటకట అంటూ పొలాల బాట పడుతున్న మహిళలు, పిల్లలు, అధికారులు స్పందించరు! అసలే పేదరికం త్రాగునీరైన సమృద్ధిగా దొరుకుతుందనుకుంటే అది పేదరికంలో భాగం అయిపోయింది వివరాలు లేక వెళితే ఓబులవారిపల్లి మండలం వైకోట పంచాయతీ పరిధిలోని అరుంధతివాడలో గత నాలుగు రోజులుగా తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సరఫరా నిలిచిపోయినా! సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు, తాగునీరు అందక మహిళలు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. రోజువారీ అవసరాల కోసం కనీసం ఒక బిందెడు నీటి కోసం కాలినడకన సుదూరంలోని పొలాల్లో ఉన్న బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.



ఫిర్యాదులు చేసినా స్థానిక అధికారులు కానీ పై అధికారులు కానీ అరుంధతివాడలో నెలకొన్న తాగునీటి సమస్యపై, సంబంధిత ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని స్థానికులు వాపోతున్నారు. సమస్య వచ్చిన ప్రతిసారీ తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారేతప్పా శాశ్వత పరిష్కారం కోసం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు."బిందెడు నీటి కోసం పొలాల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు, పిల్లలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులకు చీమ కుట్టినట్టైనా లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

**తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరించాలి**

గ్రామంలో తాగునీటి ఎద్దడిపై అధికారులు వెంటనే స్పందించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) నాయకులు నాగిపోగు పెంచలయ్య, అందె సురేంద్ర డిమాండ్ చేశారు. సమస్యను తాత్కాలికం కాకుండా శాశ్విత పరిష్కారం కై చర్యలు తీసుకోవాలని వారుకోరారు.

ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని అందించడంలో అధికారులు విఫలమైతే ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రజల కోసం పనిచేయవలసిన ప్రభుత్వ అధికారులు చేష్టలుడికి ఉండిపోవడం కాదని ఇకనైనా దళిత గ్రామాలను సందర్శించి మౌలిక సదుపాయాలను కల్పనలో ముందుచూపుతో వ్యవహరించాలని కామ్రేడ్ల కోరారు

# పరుగుల పందెంలో ... గిరిజన విద్యార్థిని దూకుడు

**రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక - ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ఘన సత్కారం**



**అనంతపురం స్పోర్ట్స్, ఆగస్టు 09,( రిపబ్లిక్ న్యూస్):**

గిరిజన విద్యార్థిని అథ్లెటిక్స్‌లో సత్తా చాటింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థిని ఘన సత్కారం అందుకుంది. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం పట్టణంలోని గిరిజన భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను గిరిజన నాయకులు, ప్రముఖులు అభినందించారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప, బంజారా గిరిజన సమైక్య జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్కె మహేష్, గిరిజన సంక్షేమ సంఘం రాయలసీమ జిల్లా అధ్యక్షుడు సూర్య నాయక్, టీడబ్ల్యూ శ్రీనివాసులు తదితరులు శాలువాతో సత్కరించి మెమొంటోను అందజేశారు.

**క్రీడా వసతులతో ప్రపంచస్థాయిలో రాణించే అవకాశం**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల్లో అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉందన్నారు. వారికి సరైన శిక్షణ, ప్రోత్సాహం, అవసరమైన క్రీడా వసతులు అందిస్తే రాష్ట్ర స్థాయిని దాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించే అవకాశం ఉందన్నారు. చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గిరిజన యువతలోని ప్రతిభను వెలికితీసి వారికి అండగా నిలవడమే లక్ష్యమన్నారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడం విద్యార్థినితో పాటు ఆమె తల్లిదండ్రులు, పాఠశాల, గిరిజన సమాజానికి గర్వకారణమన్నారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సత్కారం గిరిజన విద్యార్థుల్లో మరింత క్రీడా స్ఫూర్తిని నింపుతుందని తెలిపారు.

# గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**సంకల్పంతో గిరిజనులు ఎదగాలి**

**గిరిజన సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

**ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప**



**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 09,(రిపబ్లిక్ న్యూస్):**

గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, గిరిజనులు మంచి సంకల్పంతో అలాగే ఎదగాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబంలోని తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దే విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని గిరిజన భవన్ లో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో భాగంగా స్థానిక గిరిజన భవన్ నందు ఇండియన్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప, రాష్ట్ర ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు సభావత్ సోమ్లా నాయక్,అలాగే వివిధ గిరిజన సంక్షేమ, అభివృద్ధి సంఘాల ప్రతినిధులు, రక్తదాతలు, పలు శాఖ అధికారులు,గిరిజన గురుకుల పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, పలువురు గిరిజన మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తొలుత ప్రపంచ ఆదివాసి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆదివాసుల మానవ హక్కుల పరిరక్షణ పర్యావరణం అభివృద్ధి విద్యా, వైద్య రంగాలలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి సహకారం అందించడమే అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవ ముఖ్య ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు అనేకసంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న నేపథ్యంలో అర్హులందరూ వాటిని ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఎవరో వస్తారు, ఏదో చేస్తారని వేచిచూడకుండా ఒక సంకల్పంతో గిరిజనులు ఎదగాలని అన్నారు. తమ పిల్లలను మంచి విద్య బోధనలు నేర్పించి వారు ఉన్నత స్థాయికి వెళ్లడానికి దోహదపడాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా గిరిజనలు అంటే ఒక ప్రత్యేక భావన ఉంటుందని, వారందరికీ కూడా ప్రత్యేకమైన కట్టుబాట్లు, ఆచారాలు, అలవాట్లు ఉంటాయని, ఇక్కడున్న వారందరికీ ఒక ప్రత్యేకత ఉంటుందని, మీరు చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించిన మీతో పాటు మీ సాంప్రదాయాలను కట్టుబాట్లను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

అలాగే గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు, స్కిల్ డెవలప్మెంట్, ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అవసరాలను గుర్తించి గిరిజన ప్రజల సంక్షేమం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులైన బి.ఈ.డి, టిటిసి చేసిన గిరిజన యువతి యువకులకు ఉచితంగా డీఎస్సీ 2024 కోచింగ్ ఇవ్వడం జరిగిందని జిల్లా కలెక్టర్ గుర్తు చేశారు. అటవీభూములు సాగులో ఉన్న గిరిజన రైతులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు, గిరిజన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసులు అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ప్రభుత్వ చట్టాల పైన గిరిజనులకు అవగాహన ఉండాలని ఆదివాసుల జీవన విధానం సమాజానికి ఆదర్శం కావాలని అలాగే సాంప్రదాయాలను రాబోయే తరాలకు అందించాలని తెలిపారు.

ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి సంస్కృత పరిరక్షణ కోసం కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు వారి మాతృభాషలో సులభంగా అర్థమయ్యేలా బోధించి తద్వారా డ్రాపవుట్ రేట్ ను తగ్గించడం కోసం ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుని అమలు చేస్తున్నదని తెలిపారు. జిల్లాలో కూడా గౌరవ జిల్లా కలెక్టర్ గిరిజనుల సంక్షేమం కోసం పాటుపడుతున్నట్లు కొనియాడారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న గిరిజన ప్రజల అనేక సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న కలెక్టర్ కు గిరిజన ప్రజల తరపున కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. గిరిజనులు విద్యాపరంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు.

జిల్లాలోని గిరిజన తండాలు కాలనీలు , గురుకుల పాఠశాలలు, బాల బాలికల హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి ఖాళీలను భర్తీ చేయాలని, క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి ఆయా గ్రామాలలో గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ కు విన్నవించారు. దీనిపై





జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, సాంస్కృతిక గిరిజన నృత్యాలు అందరిని అలరించాయి.

ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి కుష్బూ కొఠారి, ప్రిన్సిపాల్ లు మసూద్ వలి, ప్రవీణ్ కుమార్, కేశవ నాయక్, డివిఎంసి మెంబర్ పోలా మహేష్, సాకే వీరాంజనేయులు, మహేష్ నాయక్ బంజారా సంగ అధ్యక్షులు శివ శంకర్ నాయక్, అశ్వర్థ నాయక్, శ్రీమతి కావేటి ఉమా మహేశ్వరీ, సాకే ముసలయ్య, మల్లికార్జున నాయక్, ముత్యాలమ్మ, రవి కుమార్ నాయక్, పాల్యా రామాంజనేయులు నాయక్, రాజేష్ నాయక్, పామిడి రమేష్ నాయక్, సురేష్ నాయక్, సాకే గాయత్రి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 09,(రిపబ్లిక్ న్యూస్):**



ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు.ఆదివారం నగరంలోని హౌసింగ్‌బోర్డులో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. సాక్ష్యం సంస్థ సహకారంతో నిర్వహించిన శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. 250 మందికిపైగా కంటి పరీక్షలు చేయించుకోగా.. 80 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిలో 40 మందిని కడపలోని పుష్పగిరి ఆసుపత్రికి తరలించారు.కార్యక్రమానికి భాజపా జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర కార్యదర్శి సంధి రెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర సేల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి సరిపూటి రమణ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్, రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి వెంకటేశ్వర్‌రెడ్డి, జాతీయ అవార్డు గ్రహీత, శాస్త్రీయ నృత్య కళాకారిణి హరిత తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని సూచించారు. కంటి శస్త్రచికిత్సలకు అధిక వ్యయం అవుతున్న నేపథ్యంలో ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినంద నీయమన్నారు. సాక్ష్యం సంస్థ ఆధ్వర్యంలో ఇది 108వ ఉచిత కంటి వైద్య శిబిరమని, ఇప్పటివరకు 12 వేల మందికిపైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ప్రతి నెల రెండో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయించేందుకు సహకరిస్తామని చెప్పారు.కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకులు రత్నమయ్య, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, సాయి వివేక్, గురుశ్రీధర్, లింగం నాయుడు, సునీల్, రవికుమార్, మురళి, మధుసూదన్ తదితరులు, స్థానికులు పాల్గొన్నారు

# హెచ్ఎల్‌సీ కాలువ ప్రక్షాళనకు కదిలిన పౌరులు

**150 మంది శ్రమదానం ..5 వేల కిలోల చెత్త తొలగింపు**



**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 09,(రిపబ్లిక్ న్యూస్):**

నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను చాటుతూ 150 యువతతో కలిసి ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో నిండిపోయిన హెచ్ఎల్‌సీ కాలువను శ్రమదానంతో శుభ్రం చేశారు. దాదాపు 5 వేల కిలోల ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించారు. సుమారు ఆరు ట్రాక్టర్ లోడ్ల చెత్తను కాలువ నుంచి బయటకు తీశారు.'క్లీన్ డ్రైవ్ ఫర్ ఎ క్లీన్ అండ్ గ్రీన్ అనంతపురం' పేరుతో డిస్కవర్ అనంతపురం, రోటరీ క్లబ్ ఆఫ్ అనంతపురం, ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీ, అనంతపురం యువత సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకుడు ఏజీ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వివిధ వర్గాల నుంచి విశేష స్పందన లభించింది.

**చెత్తను తొలగించిన స్వచ్ఛంద సేవకులు**

కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్, వ్యర్థాలను యువత స్వయంగా తొలగించారు. రోటరీ క్లబ్ సభ్యులు ఏజీ వేణుగోపాల్‌రెడ్డి, సుధీర్ చురుగ్గా పాల్గొన్నారు. అనంతపురం కాక్రోచెస్‌కు చెందిన సోహైల్, నందా, లోకేష్, వారి బృందం, ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీకి చెందిన సంజీవ్‌రెడ్డి బృందం శ్రమదానం చేశారు. నగర యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అధికారులూ.. పౌరులతో కలిసి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ (ఎంహెచ్ఓ), పారిశుధ్య సిబ్బంది కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. పౌరులతో కలిసి కాలువలోని వ్యర్థాలను తొలగించారు.



ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, మున్సిపల్ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తే నగర పరిశుభ్రత మరింత మెరుగుపడుతుందని ఈ కార్యక్రమం చాటింది.

**ప్రతి పౌరుడిని భాగస్వామిని చేయడమే లక్ష్యం**

ఏజీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. కాలువను శుభ్రం చేయడం మాత్రమే కార్యక్రమం ఉద్దేశం కాదని, నగర పరిశుభ్రతలో ప్రతి పౌరుడిని భాగస్వామిని చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమానికి లభించిన స్పందన ప్రజల్లో పర్యావరణంపై ఉన్న చైతన్యాన్ని తెలియజేస్తోందన్నారు. ప్రతి వారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని నిర్వాహకులు కోరారు. హెచ్ఎల్‌సీ కాలువ శుభ్రతతో ఉద్యమం ఆగదని, 'క్లీన్ అండ్ గ్రీన్ అనంతపురం' లక్ష్యంగా నిరంతర ప్రజా భాగస్వామ్యంతో కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు.

# ఆదివాసీ భవితకు.. ప్రగతి వెలుగులు

**హక్కులు, ఆత్మగౌరవం, అవకాశాలకు పెద్దపీట వేయాలి -ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో బోయ గిరిజమ్మ**






**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 09,(రిపబ్లిక్ న్యూస్):**

ఆదివాసీ భవితకు.. ప్రగతి వెలుగులు అందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అడవుల్ని కాపాడుతూ.. ప్రకృతిని ఆరాధిస్తూ.. తరతరాలుగా తమ సంస్కృతి, సంప్రదాయాలను భుజాన మోస్తున్న ఆదివాసీ సమాజం దేశానికి గర్వకారణమని చైర్‌పర్సన్ అన్నారు. ఆదివాసీల అభ్యున్నతి ఒక వర్గం ప్రగతికే పరిమితం కాదని.. సమాజ సమగ్ర అభివృద్ధికి అది కొలమానమని పేర్కొన్నారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గిరిజమ్మ పాల్గొన్నారు. ఏకలవ్యుడు, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సంత్ లాల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆదివాసీ సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రకృతికి ప్రాణం.. ఆదివాసీల జీవనం**

ప్రకృతితో మమేకమై జీవిస్తున్న ఆదివాసీలు అడవులు, జీవ వైవిధ్యం, ప్రకృతి వనరులకు సహజ సంరక్షకులుగా నిలుస్తున్నారని గిరిజమ్మ అన్నారు. తమ ప్రత్యేక భాష, సంస్కృతి, సంప్రదాయాలను తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న ఆదివాసీ సమాజం నుంచి నేటి తరాలు ఎంతో నేర్చుకోవాల్సి ఉందన్నారు.

**విద్య.. ఉపాధి.. వైద్యానికి ప్రాధాన్యం**

ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు విద్య, ఉపాధి, ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ భాష, సంస్కృతి, సంప్రదాయాలు కాలగర్భంలో కలిసిపోకుండా భవిష్యత్ తరాలకు అందించేందుకు సమష్టి కృషి అవసరమన్నారు.ఆదివాసీల అభివృద్ధి అంటే ఒక వర్గం అభివృద్ధి కాదు.. సమాజ సమగ్ర ప్రగతికి ప్రతీక అని గిరిజమ్మ అన్నారు. ఆదివాసీ సమాజ హక్కులు, సంక్షేమం, అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, ఎస్టీ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారు

### విజయ విఠల ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ యూసుఫ్ ,ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్



**చిప్పగిరి, ఆగస్టు, 9,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి విజయ విఠల ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఘనవిజయం సాధించిందని, జిల్లా స్థాయి గ్రూప్ స్కిపింగ్ సెలక్షన్లో సత్తా చాటిన ఆణిముత్యాలని, విద్యార్థినీ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు క్రీడల్లో కూడా ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారనిస్కూల్ కరస్పాండెంట్ యూసుఫ్ ఆదివారం విలేకరుల సమావేశంలోతెలిపారు,మాట్లాడుతూ ఈరోజు నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో జరిగిన జిల్లా స్థాయిలో స్కిప్పింగ్ సెలక్షన్లో విజయ విఠల ఇంగ్లీష్ మీడియం స్కూల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, పాఠశాల నుండి మొత్తం 16 మంది క్రీడాకారులు జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొనగా, వారిలో ఏడు మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఎంపిక కావడం పాఠశాలకు ఎంతో గర్వకారణం అని, అందులో ఇద్దరికీ గోల్డ్ మెడల్స్, మరో ఇద్దరికి సిల్వర్ మెడిల్స్, ముగ్గురకు బ్రాంజ్ మెడల్స్, మొత్తం 7 మంది క్రీడాకారులకు రాష్ట్రస్థాయి పోటీలు ఎంపిక అయ్యారని, మరియు ఈనెల 23వ తేదీ రేణిగుంటలో జరగనున్న రాష్ట్రస్థాయిలో స్కిప్పింగ్ పోటీలలో మా విద్యార్థులు పాల్గొననున్నారని, గత రెండు సంవత్సరాలుగా మా విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారని, వారి ప్రతిభ కృషి పట్టుదల ఎంతో అభినందనీయమని, రాబోయే రోజుల్లో మా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో దాటి అంతర్జాతీయ స్థాయిలో కూడా అద్భుత ప్రదర్శనలు కనపరచాలని ఆకాంక్షిస్తున్నానని,రాష్ట్రస్థాయి ఎంపికైన మా క్రీడా ఆణిముత్యాలకు హృదయపూర్వక అభినందనలు అని విజయ విఠల ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ యూసుఫ్, ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్ తెలిపారు.

## వేణుగోపాల స్వామికి బహుళ ఏకాదశి ప్రత్యేక పూజలు



**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 09 రిపబ్లిక్ న్యూస్**

స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి ఆదివారం బహుళ ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఉదయాన్నే ఆలయ ప్రధాన అర్చకుడు వశిష్టాచార్య ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకము అలంకరణ గావించారు ఆషాడ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజారి కార్యక్రమాలలో పాల్గొన్నారు వారికి స్వామి అమ్మవార్ల పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు.

# బోయకొండపై కిటకిటలాడిన భక్తజనం



**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 09 రిపబ్లిక్ న్యూస్**

ప్రముఖ శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సంఖ్య విశేష రీతిలో పెరిగింది వివిధ సేవా టికెట్ల రూపంలో రూ 24 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి ఆషాడమాసం ఆఖరు ఆదివారం కావడంతో కర్ణాటక తమిళనాడు తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి ఎక్కడ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం అందరికీ అందుబాటులో ఉండి తగిన చర్యలు తీసుకున్నారు ఆలయంలో సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వివరించారు క్యూలైన్ల ప్రక్షాళన వల్ల అతి త్వరగా దర్శనాలు అవుతున్నట్లుగా పేర్కొన్నారు కాగా కొండ క్రింది నుంచి పై వరకు వాహనాలు అక్కడక్కడ ఆగిపోవడంతో ట్రాఫిక్కు అంతరాయం వాటిలింది. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై చిన్న రెడ్డప్ప బందోబస్తు చర్యలు చేపట్టారు.

## అల్మాయిపేట్ గ్రామంలో బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు తెనుగు రాజయ్య జన్మదినవేడుక సంబరాలు







**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 9**

సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం ఆందోల్ మండలం అల్మాయిపేట్ గ్రామం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యూత్ ఐకాన్ తనను నమ్ముకున్న వ్యక్తులు ఎవరైనా సరే పార్టీలకు సంబంధం లేకుండా ఎవరికి ఆపద వచ్చిన నేనున్నాను మీకు అని భరోసానిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తూ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను ఎల్లవేళలా కాపాడుకుంటూ తనదైన శైలిలో తన ఒక ఉపాధ్యాయ వృత్తిలో ఉండి కూడా ప్రజాసేవే నాకు ముఖ్యమని భావిస్తూ చిన్న పెద్ద తేడా లేకుండా అందరితో కలిసి మెలిసి ఉండే వ్యక్తిగా పేరు తెచ్చుకున్న తెనుగు రాజయ్య ఆయన పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో సంబరాలు అం బరాన్ని అంటే విధంగా పార్టీ నాయకులు నిర్వహిస్తున్నారు . ఈ యొక్క కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు చిన్నలు పెద్దలు అందరూ విచ్చేసి విజయవంతం చేయగలరని కోరుకుంటున్న మీ మాజీ సర్పంచ్ బుడ్డోల్ల రవిశంకర్ గ్రామా ప్రజలు బి ఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు







# సేవా పురస్కార గ్రహీతకు ఘన సన్మానం

### స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ వారసుడు సూర్యనారాయణరెడ్డికి అభినందనలు









**గుత్తి, ఆగస్టు 9:( రిపబ్లిక్ న్యూస్)**

కేంద్ర ప్రభుత్వం నుంచి సేవా పురస్కారం అందుకున్న పెద్దవడుగూరు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ వారసుడు ఎద్దుల సూర్యనారాయణరెడ్డికి గుత్తిలో ఘన సన్మానం లభించింది. గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో పట్టణ ప్రజలు, సమితి సభ్యులు, స్నేహితులు ఆదివారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఢిల్లీలో గత నెల 25న కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతుల మీదుగా సూర్యనారాయణరెడ్డి సేవా పురస్కారాన్ని అందుకున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సన్నాయి మేళంతో సూర్యనారాయణరెడ్డిని గాంధీచౌక్కు తీసుకెళ్లారు. అక్కడ మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీచౌక్ నుంచి ఆర్అండ్బీ బంగ్లా ప్రాంగణం వరకు సన్నాయి మేళం మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఆర్అండ్బీ బంగ్లా ప్రాంగణంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. పెద్దవడుగూరుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు కీర్తిశేషులు ఎద్దుల చిన్న శరభారెడ్డి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. ఆయన కుమారుడైన సూర్యనారాయణరెడ్డి చిన్న వయస్సులోనే తండ్రితో కలిసి 12 రోజులు జైలు శిక్ష అనుభవించారని తెలిపారు.

పెద్దవడుగూరు గ్రామానికి మహాత్మాగాంధీ వచ్చిన సందర్భం సూర్యనారాయణరెడ్డి జీవితంపై చెరగని ముద్ర వేసిందన్నారు. అప్పటి నుంచి గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని రాయలసీమ అభివృద్ధి, పేదల సంక్షేమం, సామాజిక సేవా కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొంటున్నారని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, వారి చరిత్రను నేటి తరానికి పరిచయం చేస్తూ అవగాహన కల్పించేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

సూర్యనారాయణరెడ్డి సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గత నెల 25న ఢిల్లీలో సేవా పురస్కారంతో సత్కరించడం గుత్తి, పెద్దవడుగూరు ప్రాంత ప్రజలకు గర్వకారణమన్నారు. ఈ పురస్కారం అందేలా కృషి చేసి, అవార్డు సాధనలో సహకరించిన ధర్మవరం వాస్తవ్యురాలు, డీడీఆర్ ప్రాజెక్టు అంబాసిడర్ సరళను కూడా ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

అనంతరం సూర్యనారాయణరెడ్డిని శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి, ఆయన ప్రజాసేవను కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల త్యాగాలు, చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను మరింతగా నిర్వహించాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు.

కార్యక్రమంలో కరిడికొండ సూర్యచంద్రుడు, వలిసాహెబ్, హుస్సేన్‌పీరా, జేవీవీ జిల్లా మాజీ అధ్యక్షుడు, గుత్తి కోట సంరక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, సాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ రాంబాబు, బీజేపీ నాయకులు తిమ్మారెడ్డి, భగవాన్ సత్యసాయి సేవా సమితి గుత్తి మండల కన్వీనర్ ఎం.వి.రమణ, షిర్డీసాయి సేవా సమితి నాయకుడు సత్యనారాయణరెడ్డి, గుత్తి ఆర్టీసీ యూనియన్ నాయకులు, పెద్దవడుగూరు గ్రామ నాయకులు రామచంద్రరెడ్డి, మల్లికార్జున, సీపీఐ నాయకులు రమేష్‌బాబు, మాబు,గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు బాబా ఫకృద్దీన్, రిటైర్డ్ ఉపాధ్యాయులు సుధాకర్‌బాబు, హెచ్‌ఎం జీలాన్, గట్టు వీరేష్, సోషల్ మీడియా కన్వీనర్ శివ, రహిమాన్, సీనియర్ సిటిజన్లు డి.ఆర్.రమేష్, రఫీద్దీన్, అప్పేచర్ల చంద్రశేఖర్, గోవర్ధన్‌రెడ్డి, క్రిష్టిపాడు రాముడు, మామూడూరు రమణారెడ్డి, కాసేపల్లి వీరుపాక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్ కేశవ నగర్ పద్మశాలి యువజన మహిళా సంఘ ఆధ్వర్యంలో ఘనంగా ఆషాడ మాస గోరింటాకు గాజుల పండుగ



**రాయికల్ మండలం ఆగస్టు,10( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని కేశవ నగర్ పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం గోరింటాకు గాజుల పండుగ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గోరింటాకు పెట్టుకుని గాజులు ధరించి ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు, అనంతరం పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు ఇట్టి కార్యక్రమంలో కేశవ్ నగర్ పద్మశాలి మహిళలు కౌన్సిలర్ ఎలిగేటి లతిక అనిల్ కుమార్, గంట్యాల లక్ష్మి, బీమానాతి భాగ్య, బొమ్మ కంటి శ్రావణి, దువ్వ భారతి, ఆడెపు రమ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతశీ చేశారు

## ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

### జగన్నాథ్ పూర్ సర్పంచ్ ఆధ్వర్యంలో లో.....



**రాయికల్ మండలం ఆగస్టు 09( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జగన్నాథ్ పూర్ గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురష్కరించుకొని సర్పంచ్ మాట్లాడుతూ ఆదివాసీ గ్రామం మన జగన్నాథ్ పూర్ అభివృద్ధి కొరకు తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మన స్థానిక మీూా. ఐతీ. సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ తో పెట్టి నాయికపుగూడెం లో ని వాసులకు రోడ్డు సౌకర్యం లేక చాలా ఇబ్బంది పడుతున్నారు అని సర్పంచ్ పరాచ. శంకర్ తెలుపగానే 75లక్ష లతో బి.టీ.రోడ్డు మంజూరు చేయించారు. అలాగే మా గ్రామంలో చాలా మంది పూరి గుడిసెలలో నివసిస్తున్నారు మా గ్రామానికి ఎక్కువ మొత్తం లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని మాట ఇవ్వడం జరిగింది. మా గ్రామానికి వంతెన జగన్నాథ్ పూర్ -బోర్నపల్లి మధ్యలో పెద్ద వాగు వంతెన నిర్మాణం కొరకు కాంట్రాక్టర్స్ ఎవరు ముందుకు రావడం లేదు చొరవ చూపాలని సర్పంచ్ పరాచ. శంకర్ కోరడం తో తక్ష ణమే 16.20కోట్ల వ్యవంతో ప్రతిపాదనలు తయారు చేసి మంజూరు కొరకు గౌరవ గిరిజన శాఖ మంత్రి అడ్లూరి. లక్ష్మణ్ గారిని కలిసి వినతి పత్రం మన గౌరవ మీూా. ఐతీ. సంజయ్ కుమార్ ఇవ్వడం జరిగింది.అలాగే భూ సర్వే -రీ సర్వే కార్యక్రమం లో గ్రామంలో ఉన్న వ్యవసాయ భూమి సమస్యలు కూడా పరిష్కరించే విధంగా చొరవ చూపిస్తానని హామీ ఇచ్చారని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్. పరచ. శంకర్. పటేల్. సుధాకర్, ప్రజా ప్రతినిధులు, కోరేంగ. లక్ష్మి నారాయణ, ఆత్రం. సచిన్ రాజ్, మధు, తరుణ్, గంగారాం తదితరులు గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ అనిల్ కంటి ఆపరేషన్‌కు రూ.40,400 ఆర్థిక సాయం



**ఎమ్మిగనూరు, ఆగస్టు 9 (ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (APUWJ) సభ్యుడు అనిల్ లేజర్ కంటి ఆపరేషన్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.40,400 ఆర్థిక సాయం అందించారు.ఆదివారం స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (APUWJ) తాలూకా అధ్యక్షుడు శ్రీనివాస నాయుడు, పట్టణ అధ్యక్షుడు పరమేశ్వర, తాలూకా కార్యదర్శి చిన్నఆకుల నాగరాజు, సీనియర్ నాయకులు హేమంత్ కుమార్, బజారప్ప, గోవిందరాజులు ఆధ్వర్యంలో అనిల్‌కు వైద్య ఖర్చుల కోసం నగదు సాయం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనతో పాటు వారి రక్షణ, విద్య, వైద్య సేవల కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టులకు అవసరమైన సమయంలో అండగా నిలవడమే తమ లక్ష్యమన్నారు.ఆర్థిక సాయం అందించిన యూనియన్ నాయకులకు జర్నలిస్ట్ అనిల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఆధారాలుంటే చూపించండి




### అధ్యక్షుడు రమేష్ కౌంటర్
### ఇందిరమ్మ కాలనీ విమర్శలపై ...
### ఎస్సీ సంక్షేమ సంఘం మండిపాటు

**అనంతపురం రూరల్, ఆగస్టు 09,(రిపబ్లిక్ న్యూస్):**

అభివృద్ధి పనులపై విమర్శలు చేసే ముందు ఆధారాలు చూపించాలని నారాయణపురం పంచాయతీ ఇందిరమ్మ కాలనీల ఎస్సీ జన సంక్షేమ సంఘం అధ్యక్షుడు పూలకుంట రమేష్ అన్నారు. కాలనీలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేస్తే సరిపోదని, వాటిని ఆధారాలతో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంటే ఇది జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు విమర్శించడం తగదని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**ఎక్కడ అవినీతి జరిగిందో స్పష్టంగా చెప్పాలి**

ఇందిరమ్మ కాలనీలో మారుతి వికలాంగుల సంఘం అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌పై చేసిన విమర్శలకు రమేష్ స్పందించారు. ఎమ్మెల్యే అభివృద్ధి చేయడం లేదని చెప్పే ముందు.. కాలనీలో ఎక్కడ అభివృద్ధి జరగలేదో, ఎక్కడ అవినీతి జరిగిందో స్పష్టంగా చెప్పాలని కోరారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

**అభివృద్ధి కనిపిస్తుంటే.. విమర్శలెందుకు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ కాలనీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని రమేష్ తెలిపారు. జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు టీడీపీ నేతలతో పాటు తనపైనా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.కేవలం విమర్శలతో పాటు ఆధారాలు చూపిస్తే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

**పట్టాల విక్రయాలపై విచారణ జరపాలి**

గత వైసీపీ పాలనలో ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల విక్రయాలకు సంబంధించి ఆరోపణలు ఉన్నాయని రమేష్ పేర్కొన్నారు. కాలనీలో ఈ విషయం అందరికీ తెలుసన్నారు. ఇళ్ల పట్టాల విక్రయాలపై స్థానిక తహసీల్దార్ విచారణ చేపట్టి వాస్తవాలను నిగ్గుతేల్చాలని కోరారు. పట్టాల విక్రయాలకు పాల్పడినట్లు విచారణలో తేలితే సంబంధిత వ్యక్తులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, వీఆర్వో, ఇతర అధికారులను కోరారు.

# తెలంగాణ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన మహ్మద్ సాధిఖ్.,



**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 9**
తెలంగాణ రాష్ట్రంలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం వుంది., గ్రామ దేవతలు అనబడే పోషమ్మ, ఎల్లమ్మ, మల్లమ్మ, నల్ల పోచమ్మ,మైషమ్మ, బూరుజు మైషమ్మ,.రక రక లుగా పేర్లతో గ్రామ దేవతలు వెలసినారు., గ్రామ దేవతలు ఏడు గురు అక్క చెల్లెళ్లు., వారికీ ఒక తమ్ముడు పోతురాజు., గ్రామ దేవతలు మహిమలు గల దేవతలు విరి పేరు పైన గ్రామాల్లో, పట్టణాల్లో, బోనాల పండుగ ఘనంగా నిర్వహిస్తారు., రాష్ట్ర ప్రజలందరికి బి ఆర్ ఎస్ రాష్ట్ర మైనారిటీ నేత మహ్మద్ సాధిఖ్ ఒక ప్రకటనలో బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పూర్వం గ్రామాల్లో పట్టణాల్లో తప్పక గ్రామ దేవతల ఆలయాలు ఉండేవి, ప్రతి సంవత్సరం బోనాల పండుగ ను భక్తి శ్రద్దలతో నిర్వహిస్తారు.పూర్వం వైద్య సౌకర్యాలు లేని రోజుల్లో ప్రజలకు మసుచి, అమ్మ తల్లి, రక రక ల వ్యాధి లు సోకితే గ్రామ దేవతలకు పూజించి, నైవేద్యం, పెట్టితే రోగాలు పూర్తిగా నయం అయ్యాయానే మాట మన పూర్వికులు చెప్పుతారు. అలాగే గ్రామాల్లో పూర్వం బోనాల పండుగకు గ్రామ బోనం అనే పేరుతో కుల మతాలకు అతీతంగా గ్రామ దేవతల ఆలయం నిర్వాహకులు ప్రతి ఇంటి నుండి బియ్యం, బెల్లం, శక్కెర, పసుపు, మంచి నూనె, అల్లం ఎల్లిపాయలు,ఉప్పు , తదితర వస్తువులు సేకరించి మొదటగా గ్రామ దేవతలకు గ్రామ, ఓరి, బోనం అని సమర్పించి, గ్రామాన్ని ప్రజలను కాపాడు తల్లి అని మొక్కులు చెల్లించుకొనే వారని సాధిఖ్ గ్రామీణ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తు చేశారు.తర్వాత గ్రామ ఆడపడుచులు బోనం సమర్పిస్తారని అన్నారు. హైదరాబాద్ నగరం లో కూడ బోనాల పండుగ చూడ ముచ్చటగా భక్తి శ్రద్దలతో జరుపుకుంటారని అన్నారు. తెలంగాణ అంటే నె పండుగలకు కోదువ లేదని ఏడాది పాటు ఏదో ఒక సందర్భంలో పండుగలు వుంటాయని, ప్రపంచం లో ఎక్కడ కూడ ఇన్ని పండుగలు లేవని, కేవలం భారత దేశం పండుగలకు పెట్టింది పేరు అని సాధిఖ్ కొనియాడారు.

# ముర్కుంజాల్‌లో 20 నూతన విద్యుత్ లైట్ల ఏర్పాటు

**ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తామన్న సర్పంచ్ అనూష లాల్ కుమార్**



**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు9**
కంగ్టి మండల పరిధిలోని ముర్కుంజాల్ గ్రామంలో ఆదివారం 20 నూతన విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశామని గ్రామ సర్పంచ్ సారంగి అనూష లాల్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.గ్రామంలో ఏ సమస్య ఉన్నా ఎప్పటికప్పుడు మరమ్మతు పనులు చేస్తున్నామని చెప్పారు.వర్షాకాలంలో కొన్ని బల్బులు వెలగకపోవడంతో వాటిని తొలగించి కొత్త విద్యుత్ బల్బులను అమర్చినట్లు వివరించారు.పలు కాలనీల్లో విద్యుత్ బల్బులు పాడైపోయాయని తమ దృష్టికి రావడంతో వెంటనే స్పందించి నూతన విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ దఫా మొత్తం 20 లైట్లను గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని తెలిపారు.గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, త్వరలోనే పరిష్కరిస్తామని సర్పంచ్ అనూష లాల్ కుమార్ హామీ ఇచ్చారు.

# ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్న చింత సాయినాథ్





**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 9**
ఏడుపాయల శ్రీ వనదుర్గ భవానీ మాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ ఏడుపాయల శ్రీ వనదుర్గ భవానీ మాతను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారి తనయుడు చింత సాయినాథ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సాయినాథ్ గారికి ఘన స్వాగతం పలికి, అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సాయినాథ్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు,పార్టీ నాయకులు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ : దరఖాస్తుకు మరో రెండు రోజులే గడువు



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల టవర్స్' పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, కమిషనర్ వీపీ గౌతమ్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అర్హులైన పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.జీహెచ్ఎంసీ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మించనున్న 7,680 ఎల్ఐజీ ఇళ్ల కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోంది. దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు 10 (సోమవారం) ఆఖరు తేదీ అని అధికారులు తెలిపారు. శనివారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35,125 దరఖాస్తులు వచ్చినట్లు వీపీ గౌతమ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద ఒక్కో ఫ్లాట్ నిర్మాణ వ్యయం రూ. 11 లక్షలు కాగా, ప్రభుత్వం రూ. 5 లక్షల సబ్సిడీ అందిస్తోంది.

వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఆగస్టు 30న కంప్యూటరైజ్డ్ లాటరీ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. లాటరీలో ఎంపికైన వారికి ఏడాదిలోపు ఇళ్లను నిర్మించి అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. లాటరీలో ఇల్లు కేటాయించని దరఖాస్తుదారులు చెల్లించిన రూ. 10,000 డిపాజిట్ ఫీజును తిరిగి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు భరోసా ఇచ్చారు. ఆసక్తి కలిగిన అర్హులు మీసేవ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

# అధికారుల అక్రమం

# చోటా కాంట్రాక్టర్ల ఆక్రమణం..!

## రిజిస్ట్రేషన్ భూముల్లో రోడ్ల నిర్మాణానికి ప్రయత్నం...!!







**రైల్వే కోడూరు ఆగస్టు 9 రిపబ్లిక్ న్యూస్.**
పర్సంటేజీలు వస్తున్నాయి అంటే ప్రభుత్వ అధికారులకు వెనక, ముందు తెలియడం లేదు దీంతో చోట మోట కాంట్రాక్టర్లు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధుల తో చేతులు కలపడం అధికారులకు ఆనవాయితీగా మారిందని, ప్రజా అవసరాలను తెల్చుకొని మౌలిక వస్తువులు కల్పించి ప్రజల కోసం పల్లెల్లో చేయవలసిన అభివృద్ధి పనులు అటుకెక్కుతున్నాయి రైల్వే కోడూరు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలలో ప్రభుత్వ నిధులు అత్యంత దుర్వినియోగంమై ప్రజలు పల్లెలకు అభివృద్ధి కి నోచుకోకుండా అడవిని కాసిన వెన్నెల ఈ నిధులు నిట్ట నిలువుగా దుర్వినియోగం అవుతున్నాయి,దీనికి తోడు కాంట్రాక్టర్లు వివిధ రకాల నిధులను కేటాయింపు చేయించుకుని వాటిని ప్రజల అభివృద్ధి కోసం కాకుండా ఎవరు కంట పడకుండా అక్రమంగా నాసిరకంగా పనులు చేసి చేయకనే అధికారులతో చేతులు కలిపి ఇవ్వవలసిన పర్సంటేజ్ వాటాను అందజేసి పనులు దక్కించుకొని కొంత చేసి కొంత చేయకనే నిధులను మింగేస్తున్నారు, ఇవే కాకుండా ప్రభుత్వం కేటాయించిన స్థలాలలో రోడ్లు కాలవలు ఇతరత్రా మౌలిక సదుపాయం కలిగిన అభివృద్ధి పనులు చేయాల్సింది పోయి రైతులకు చెందిన రిజిస్ట్రేషన్ భూముల్లో అక్రమంగా వారిని దౌర్జన్యం చేసి పనులు పేరుతో ఆ భూములను ఆక్రమించి ప్రభుత్వ నిధులను దోచుకుంటున్న వైనం రైల్వే కోడూరు మండలంలో అధికమంటే అధికం,

వివరాల్లోకి వెళితేరైల్వే కోడూరు మండలం అనంతరాజుపేట గ్రామపంచాయతీ నారాయణ రాజు పోడు గ్రామం నందు 565 —1 లో ముప్పాల శంకర్ రాజు మరియు ముప్పాల వినీషా వర్మ, ముప్పాల నీలమ్మ, లకు చెందిన రిజిస్ట్రేషన్ పట్టా భూమిలో అక్రమంగా రోడ్లు వేసి ప్రభుత్వ నిధులు దోచుకునేందుకు పందేటి జనార్దన్ రాజు(మాజీ వైసీపీ ఎంపీటీసీ) దౌర్జన్యంగా భూమిని దున్ని రోడ్డు ఫార్మేషన్కు ప్రయత్నం చేస్తున్నాడు,సుమారు 10 లక్షల ప్రభుత్వ నిధులు ప్రజాధనాన్ని దోచుకునేందుకు ఈయన అక్రమ ఆర్భాటాలు, దౌర్జన్యాలు అంతా ఇంతా కాదు,వీటి పట్ల సరైన శ్రద్ధ పెట్టి క్షేత్రస్థాయిలో పరిశీలించి గతంలో ప్రభుత్వ రోడ్ల ప్రభుత్వానికి చెందిన స్థలాల ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేపడుతున్నామా అన్నది ప్రభుత్వ శాఖల చెందిన మండల అభివృద్ధి అధికారి గాని , ఇంజనీరింగ్ శాఖ అధికారులు గానీ, ఆ మార్గంలో వెళ్లకుండా కార్యాలయంలో కూర్చొని ఎస్టిమేషన్ తయారుచేసి అక్రమార్కులకు వర్కార్డర్లు ఇచ్చి గ్రామాల్లోనూ, పంట పొలాల్లోనూ, ప్రజల మధ్య రైతుల మధ్య వివాదాలకు ఆద్యం పోస్తున్నారు,ప్రభుత్వ స్థలంలో పదిమంది ప్రజలకు ఉపయోగపడే విధంగా రోడ్లు వేయాల్సిన అధికారులు వాటిని పరిశీలించకనే అక్రమార్కులు ఇచ్చే కాసులకు పర్సంటేజీలకు లోనై వారికి పనులు కట్ట పెట్టి పల్లెల్లో వివాదాలను సృష్టిస్తున్నారు,ప్రజలకు రైతులకు అవసరమైతే ప్రభుత్వ స్థలాలు లేకపోతే ప్రజలకు కనీస అవసరాలు కచ్చితంగా తీర్చాలని ఉద్దేశం ఉంటే పట్టా భూముల్లో గాని,రైతుల భూముల గాని, కొనుగోలు చేసి ఆ భూముల్లో రోడ్లు గాని కాలవ పనులు గాని చేపట్టి పదిమంది ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రయత్నం చేసి నిధులు కేటాయించి ప్రజలకు మార్గం చూపడంలో తప్పులేదు,అయితే అధికారులు అక్రమ నాయకులతో చేతులు కలిపి బారుల్లో విలాసవంతమైన నివాసాల్లో (అతిథి గృహాల్లో) వీరుతో కలిసి అధికారులు మీలాకాతై మాటా మంతి కలుపుకొని విందు భోజనాలు మధ్యలో సేమించి వీరు చేస్తున్న సొంత కాలు (క్రైపులో కళ్ళు మూసుకుని చేస్తున్న సంతకాలు) ప్రజాధనానికి ప్రభుత్వానికి ప్రజలకు చేస్తున్న కీడు అంతా ఇంతా కాదు,నిధులను దుర్వినియోగం చేసేందుకు కంకణం కట్టుకుంటున్నారు,దీన్ని బట్టి చూస్తే కంచే చేను మేసిన చందంగా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని మండల అభివృద్ధి అధికారి,ఇంజనీరింగ్ శాఖ అధికారులు తీరిలా ఉన్నది, అధికారులు బదిలీ అయినా వారి అక్రమ పనులు మాత్రం వదలలేదు, ఓ అధికారి నెల రోజుల క్రితం బదిలీ అయితే గత 20 రోజుల క్రితం రైతు పొలంలో అక్రమంగా రోడ్డు వేసేందుకు భూమిని పరిశీలించకుండానే, ఇంటి వద్దనే కూర్చుని కాసులు దండుకుని అక్రమ ఎస్టిమేషన్లు వేసి ఇవ్వడం చూస్తుంటే ఈ అధికారుల పై అధికారుల పర్యవేక్షణ ఏమాత్రం ఉన్నదన్నది ఈ ఎస్టిమేషనే అందజేసిన కాసులే చెబుతుంది,ఇంత స్థాయిలో తొందరగా పనులు చేయడం చూస్తుంటే వైసీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ పందేటి జనార్ధన్ రాజు, జడ్పిటిసి ఎంపిటిసిల పదవీకాలం ముగుస్తుండటంతో ఆ నిధులు ఎలాగైనా మింగేయాలి అన్న యోచనతో తన పంచాయతీ గ్రామంలోని ముగ్గురు రైతులకు చెందిన పట్టా భూములో ప్రభుత్వం మినహాయింపు ఉన్నట్లుగా దారి వేసేందుకు దౌర్జన్యం చేస్తున్నారని దీని పట్ల సంబంధిత అధికారులు భరోసా, అండ, పర్సంటేజీలకే పనంగా పెట్టారన్న ఆరోపణలు లేకపోలేదు,ఈ అధికారులు అక్రమార్కులకు అంటగట్టి చేపట్టిన అవినీతి పనులు పట్ల ఇంటలిజెన్సీ, ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టి నిజాల నిగ్గు తేల్చి దుర్వినియోగమైన ప్రజా నిధులను పరిశీలన చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారుఇలా చేస్తే రైల్వే కోడూరు నియోజకవర్గంలో పనులు చేయకనే కొన్ని, గతంలో చేసిన పనుల పైన అధికారులు చోట మోట కాంట్రాక్టర్లు కలిసి మింగిన నిధులు రైల్వే కోడూరు నియోజకవర్గంలో వందల కోట్ల లో ఉండొచ్చన్నది, నియోజకవర్గంలోని ప్రజలు, మేధావులు, చోట మోట మాజీ కాంట్రాక్టర్లు నియోజకవర్గంలో గుసగుసలు పడుతూ చెప్పుకొంటున్నారు

# బహుజనోద్యమ బలోపేతం వల్లనే రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడిస్తాం

**బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం**






**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 9**
బహుజనోద్యమ బలోపేతం వల్లనే రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడిస్తామని బహుజన్ సమాజ్ పార్టీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. ఈ రోజు నిజామాబాద్ జిల్లా కేంద్రం లో జిల్లా కమిటీ ఆద్వర్యం లో ఏర్పాటు చేసిన జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా బహుజన పితామహులైన మహాత్మాఫూలే , సాహూజీ మహరాజ్ , బాబాసాహెబ్ అంబేద్కర్ , మాన్యవర్ కాన్షీరామ్ ల చిత్ర పటాలకు పూల మాల తో నివాళులు అర్పించి అనంతరం సమీక్ష సమావేశం లో జిల్లా కమిటీ లను సమీక్షించి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. పార్టీ అంతర్గత నిర్మాణం మన బహుజన సమాజానికి రక్షణగా పని చేస్తుందని అన్నారు. సమాజంలో రోజు రోజుకు మత తత్వ రాజ్యాంగ వ్యతిరేక శక్తులు పెరుగుతున్నాయని అన్నారు. ఇటీవల ఆర్ ఎస్ ఎస్ ఛీఫ్ మోహన్ భగవత్ రిజర్వేషన్ల పై అనుచితంగా వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. బహుజన సమాజం ను కులం పేరు మీద మతం పేరు మీద విడదీసి దేశ ఐక్యత ను సమాజ ఐక్యత దెబ్బతినేలా చేస్తున్నాయని అలాంటి అరాచక శక్తులను అరికట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.అందుకు బహుజన సమాజ చైతన్యమే ముఖ్యమని అందుకోసం బహుజన ఉద్యమం ను బలోపేతం చేయాలని నిషాని రామచంద్రం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు రాజ్యాంగబద్ధంగా ఎన్నికల్లో గెలిచి రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని అహంకారపూరితంగా మాట్లాడుతున్న ఎవరినైనా ఓడించాలని పిలుపునిచ్చారు.

**రిజర్వేషన్లు సామాజిక న్యాయానికి నిలువుటద్దం**
రిజర్వేషన్లు సామాజిక న్యాయానికి నిలువుటద్దం అని అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. ఆర్ ఎస్ ఎస్ ఛీఫ్ మోహన్ భగవత్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడిన మాటలను ఆయన తీవ్రంగా ఖండించారు. వేలాది సంవత్సరాల నుండి అనిచివేతకు , వివక్షకు గురైన బాదిత కులాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే రిజర్వేషన్లు ఏకైక మార్గమని అన్నారు. ఆర్ ఎస్ ఎస్ సంస్థ మహిళ సాధికారత కు సమాజ అభివృద్ధి కి వ్యతిరేకమని ఆయన అన్నారు. రిజర్వేషన్లు రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని రిజర్వేషన్ల వలన సమాజంలో చెడు పెరుగుతుంది అని రిజర్వేషన్లు లబ్ది పొందిన వారు వాటిని స్వచ్ఛందంగా వదులుకోవాలని కోరడం ఆర్ ఎస్ ఎస్ యొక్క నిజమైన కువాదానికి నిదర్శనమన్నారు. వాటివల్ల తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలు పొందుతారేమో గాని శాస్వతంగా వారు నష్టపోతారని అన్నారు. రిజర్వేషన్లు తొలగించడం వలన రాజ్యాంగ స్పూర్తి దెబ్బతింటుందని అన్నారు. రాజ్యాంగ లక్ష్యాలను మాత్రం నెరవేర్చలేదని అన్నారు. బాబాసాహేబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా మాత్రమే సమాజం లో సమానత్వం ఏర్పడుతుందని అన్నారు. ఆర్ ఎస్ ఎస్ బిజెపి లు రాజ్యాంగాన్ని రద్దు చేయాలని కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వారిని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి బహుజన ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న బెహన్ జీ మాయావతి గారిని ఈ దేశ ప్రధానిని చేయాలని అందుకోసం నిజామాబాద్ ఎంపి సీటు గెలుపు కోసం బీఎస్పీ శ్రేణులు సైనికుల వలే పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్మూర్ కమిటీ వారు ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ రామచంద్రం గారిని నూతన పార్లమెంట్ ఇంచార్జ్ చిర్ర శంకర్ లను ఘనంగా సన్మానించారు. నిషాని రామచంద్రం సెక్టారు కమిటీ ల విభజన చేసి సెక్టారు కమిటీ ల నిర్మాణానికి తగు ఆదేశాలు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జోన్ ఇంచార్జ్ లు గైని గంగాధర్, కల్లెపెల్లి రాజేందర్ , పార్లమెంట్ ఇంచార్జ్ లు గండికోట రాజన్న చిర్ర శంకర్ జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ శకీల్ ఆహ్మద్ , అసెంబ్లీ ఇంచార్జి లు క్రిష్ణ యాదవ్ , రాజశేఖర్ అల్లెపు రాజు , పారీజాతం తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి షాక్: చెక్ బౌన్స్ కేసులో నాన్-బెయిలబుల్ వారెంట్



బీఆర్ఎస్ నేత, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి హైదరాబాద్ కోర్టులో చుక్కెదురైంది. దాదాపు దశాబ్ద కాలం నాటి చెక్ బౌన్స్ కేసులో ఆయనను దోషిగా నిర్ధారిస్తూ, న్యాయస్థానం నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.ఇంటెల్లిడెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు సంబంధించిన రూ. 34.23 లక్షల చెక్ బౌన్స్ కేసులో ఈ తీర్పు వెలువడింది. 2015లో రోహిత్ రెడ్డి ఆ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న సమయంలో, సంస్థ వనరులను తన వ్యక్తిగత వ్యాపారాలకు వినియోగించి నష్టం కలిగించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వివాద పరిష్కారానికి ఇరుపక్షాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా 2014 సెప్టెంబర్ 25న రోహిత్ రెడ్డి సదరు సంస్థకు చెక్కును అందజేశారు.అయితే, ఖాతాలో సరిపడా నిధులు లేకపోవడంతో ఆ చెక్ 2014 అక్టోబర్, డిసెంబర్ మధ్య మూడుసార్లు బౌన్స్ అయింది. దీనిపై సంస్థ పంపిన లీగల్ నోటీసులకు రోహిత్ రెడ్డి స్పందించకపోవడంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసుపై సుదీర్ఘ విచారణ జరిపిన హైదరాబాద్ మొదటి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (మున్సిపల్ కోర్టు), నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ సెక్షన్ 138 కింద రోహిత్ రెడ్డిని దోషిగా నిర్ధారించింది.తీర్పు వెలువడే సమయంలో రోహిత్ రెడ్డి కోర్టుకు హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి ఆయనపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచిన అనంతరం శిక్షాకాలాన్ని ఖరారు చేయనున్నారు.

# లాల్ ధర్వాజ బోనమేత్తిన రాయికల్ చిన్నారి.

**రాయికల్ మండలం ఆగస్టు,09( రిపబ్లిక్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర పండుగగా ఎంతో పేరు గాంచిన భోనల పండగ అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.

ఆషాఢం ఘట్టం ముగుస్తుండడముతో ఆదివారం రోజు ప్రధాన ఘట్టం నకు అంకురార్పణం జరుగుతున్న నేపథ్యంలో అందరూ భక్తి భావంతో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా భోనలు సమర్పించుతున్నా సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణము వర్తక సంఘం పరిధిలోని అనుమల్ల గణేష్ రాధ ల కుమారుడు కోడలు అనుమల్ల అభినయ్ రమ దంపతులు మరియు వాళ్ల చిన్నారి యశస్వి ని మరియు కుటుంబ సభ్యుల తో కలిసి లాల్ దరువజ లో ఉన్న అమ్మవారికి ఈ రోజు భోనం సమర్పించారు. అషడమాసము లో ఈ ఆదివారం రోజు చివరి రోజు అయిన సందర్భంగా భాగ్యానగరం యందు పెద్ద ఎత్తున బాణాసంచాలు పేలుచుతు పోతూ రాజుల విన్యాసాలు



చేస్తూ జోగిణిలు మరియు కోలాటం ఆడుతూ పాటలు పాడుతూ భోనలు మహిళలు పెద్దఎత్తున నెత్తిన పెట్టుకుని అమ్మవారి ఆలయం వద్దకు పెద్దా ఎత్తున ఎక్కడ చూసినా రోడ్లు మరియు ప్రతి విధి విధి యందు అందరినీ ఎంత గానో ఆకట్టుకున్నాయి.భోనల పండగ అంగరంగ వైభవంగా జరుగుతున్నా సందర్భంగా ప్రజలు పెద్దయెత్తున రోడ్ల పొడవునా జనంతో నిండిపోయింది. భోనల పండగ సందర్భంగా రాయికల్ కు చెందిన అనుమల్ల ఉదయ్ చందన,వినయ్, రవళి, హిమానుసు, వేదనుసు, వైష్ణవిక. వామిక మరియు రాష్ట్రంలో ని నలు మూలల నుండి ప్రజలు వచ్చి కనులు పండుగ ను ఎంతో ఆసక్తి గా తిలకించారు అలాగే మైతాపూర్ గ్రామంలో పోచమ్మ దేవాలయంలో గ్రామ వార్డ్ మెంబర్ అనుమాల్ల రమ సత్యనారాయణ లు ప్రత్యేక పూజలు చేశారు ఈసారి వర్షాలు పడుతూ వ్యవసాయ రైతులకు మేలు చేయాలని పోచమ్మ తల్లిని మొక్కరు

## రాయికల్ మాదిగ కుంట లో మురికి నీరు చేరి దోమలు ఈగలు ఎక్కువై

# రోగాలు వస్తున్నాయని పట్టణ ప్రజల ఆరోపణ

**రాయికల్ మండలం ఆగస్టు,09( రిపబ్లిక్ న్యూస్)**

పరిశుభ్రత అనేది పట్టణంలో జరగాలి కానీ మున్సిపాల్ అధికారులు ఉండి ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో ఎలాంటి అభివృద్ధి జరుగుత లేదు అనేది ప్రశ్నార్ధకంగా మారిశీది ప్రజా ప్రతినిధులు అనేవారు ప్రజలకు అధికారులకు మధ్య ఉండి చేయించే పనులుగా ఉండాలి కానీ రాయికల్ పట్టణంలో ఏలాంటి అభివృద్ధికి నోచుకోక పరిశుభ్రత పూర్తిగా లోపించింది దానికి ఉదాహరణగా జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని 1వ,వార్డులోని మాదిగ కుశీట పట్టణంలోని మురికి నీరంతా చేరి ప్రధాన సమస్యగా మారింది, వర్షాకాలంలో 12వ వార్డుల మురికి నీరంతా ఈ కుంటలోకి వచ్చి చేరడం ద్వారా దోమల స్వేర విహారం చేస్తుంటాయి, ప్రతి ఏటా పట్టణ ప్రజలు మలేరియా డెంగి వంటి వ్యాధుల బారిన పడి వైద్య ఖర్చులకు లక్షలు వేచిస్తున్నారు, ఈ విషయమై గతంలో



వైద్యాధికారులకు తెలిపిన ఏ ఒక్కరికి టెస్టులు చేసిన పాపాన పోలేదు భయానికి ప్రభుత్వ ఆసుపత్రుల డాక్టర్లు సరైన ట్రీట్మెంట్ ఇవ్వరని ప్రవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు ఇప్పటికే ఇవార్డులో ఎంతోమందికి మలేరియా డెంగు టైఫాయిడ్ వ్యాధులు వచ్చిన ప్రభుత్వ ఆసుపత్రి వర్గాలు మాత్రం ఏలాంటి టెస్టులు చేయడం లేదు ఇప్పటికైనా ప్రభుత్వ డాక్టర్లు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు టెస్టులు చేసి మందులు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు ఇక కుంటలోని మురికి నీటిని తొలగించి పట్టణ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపూతమాని రాయికల్ మున్సిపల్ కమిషనర్ గౌడ్ గతంలో తెలిపారు ఆయనే ఉండగా కాని పని అతను కొత్త పెల్లికి ట్రాన్స్ఫర్ అయి తిరిగి మళ్ళీ రాయికల్కొచ్చిన ఇంతవరకు మాదికుంట విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేరు పదిహేను కోట్ల నిధులు వచ్చాయని మాత్రం తెలుసు అవి ఇంతవరకు ఎటు వెళ్లినాయి అనే ప్రశ్న -? రాయికల్ పట్టణ ప్రజలలో ఉంది అధికారులలో చలనం రావాలంటే ప్రజాప్రతినిధులు అధికారుల పై చర్యలు తీసుకుంటేనే పనులు జరుగుతాయని ప్రజల వాదన!!

## ధర్మపాలకుల, భారతదేశం రక్షణకై
## జీయర్ స్వామివారి 70,వ తిరునక్షత్ర శ్రీరామ హృదయ కలశ యాత్ర

**-కట్కాపూర్ సర్పంచ్ పడాల పూర్ణిమ తిరుపతి**

**రాయికల్ మండలం ఆగస్టు 09( రిపబ్లిక్ న్యూస్)**

శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "శ్రీరామ హృదయ కలశ యాత్ర శ్రీరామ పాదయాత్ర" జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామం శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. వికాస తరంగిణి బాధ్యులు, అర్ధకులు చిలుకమర్రి శ్యామ సుందరాచారి, మాలెపు ఆంజనేయాచార్య, చెరుకు మధు శర్మ, వేల్పుల స్వామి యాదవ్ కలశాన్ని, చిన్నజీయర్ స్వామివారి చిత్రపటాన్ని గ్రామ సర్పంచ్ పడాల పూర్ణిమ తిరుపతి, సల్లూరి తిరుపతి, న్యాయవాది మాదం మల్లేష్ యాదవ్ లకు అందజేశారు. సర్పంచ్, ప్రజాప్రతినిధులు, భక్తులు గ్రామపంచాయతీ నుండి ఆలయం వరకు శ్రీరామ



హృదయ కలశం, చిన్న జీయర్ స్వామివారి చిత్రపటాన్ని "జై శ్రీరామ్" నామస్మరణలతో కలశాన్ని ఆలయానికి తీసుకెళ్లగా, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులచే శ్రీరామ అనిపించుకుంటూ అక్షింతలు కలశంలో వేయించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్, వికాస తరంగిణి బాధ్యులు మాట్లాడుతూ, జూలై 29 నుంచి అక్టోబర్ 26 వరకు 90 రోజులపాటు ప్రతి గ్రామంలో శ్రీరామ పాదయాత్ర, ఇంటింటి సత్సంగం, విష్ణుసహస్రనామ పారాయణం, శ్రీరామ నామసంకీర్తనం నిర్వహించి





ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడమే లక్ష్యమన్నారు. దేశంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, భారత్ విశ్వగురువుగా ఎదగాలని, ధర్మస్థాపన, ధర్మపాలకుల రక్షణతో పాటు దేశద్రోహ, తీవ్రవాద, విదేశీ శక్తుల కుట్రలు భగ్నం కావాలని ఈ యాత్ర సాగుతోందన్నారు.

## వంగర గ్రామాన్ని సందర్శించిన మాజీ ప్రధాని భారతరత్న
## దివంగత పి.వి.కూతురు డా.సరస్వతి అల్లుడు డా.కల్వకోట శరత్...

**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇన్చార్జ్ ఆగస్టు 9**

భారతరత్న మాజీ ప్రధాని దివంగత పి.వి.నరసింహారావు కూతురు డా.సరస్వతి దంపతులు చిన్ననాట పెరిగిన స్వంత ఊరు పర్యటనకు గురువారం సాయంత్రం వచ్చారు.ఐదు దశాబ్దాలకు పూర్వం తెలంగాణ నుండి అమెరికాలో స్థిరపడిన కొద్దిమందిలో డా.సరస్వతి శరత్ దంపతులు...అమెరికాలో వైద్యరంగంలో పేరొందిన డాక్టర్లుగా సపరిచతులు.చాలాకాలం తరువాత హైదరాదుకు వచ్చిన వారు పి.వి.కుమారుడు ప్రభాకర్ రావు ఆహ్వానం మేరకు వంగరకు వచ్చారు..వంగరలో చిన్ననాట గడిపిన అనుభవాలను డా.సరస్వతి గుర్తు చేసుకొని ఉద్వేగానికి లోనయ్యారు...

శుక్రవారంనాడు పి.వి.మ్యూజియంలో తన తండ్రిగారి అలనాటి ఫోటోలు,వాడిన వస్తువులు తిలకించి.పి.వి.

విగ్రహానికి పూలమాల వేసి నివాళర్పించారు డా.సరస్వతి దంపతులు.కైలాస కళ్యాణి క్షేత్రం పాత శివాలయంలో అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనంతరం. వంగర డా.రంగారావు గురుకుల పాఠశాల/కళాశాల ఇంటర్ విద్యర్ధులతో నిర్వహించిన ఒక కార్యక్రమంలో డా.శరత్ కల్వకోట మాట్లాడుతూ హుజురాబాద్ ప్రాంత పేద పిల్లలకు ఉచిత ఆశ్రమ విద్యను అందించే సంకల్పంతో మంత్రిగా డా.రంగారావు ఆశ్రమ పాఠశాల నెలకొల్పడానికి క్రుషి చేయడం సుదీర్ఘ చరిత్ర వున్న ఈ పాఠశాలలో విద్య నేర్చుకున్న అనేకమంది ఉన్నత స్థానాల్లో స్థిరపడడం గొప్ప విషయమని తెలిపారు...విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలని తల్లిదండ్రులను గౌరవిస్తూ అద్యాపకులు నేర్పిన విద్యపట్ల అవగాహనా పెంచకొని సుస్థిర జీవితంలో సుఖపడాలని ఉద్బోదించారు.వంగర గతంలో పోలిస్తే చాలా అభివృద్ధి




చెందింది.ఆత్మీయత గొప్పది.పి.వి.కుమార్తె డా.సరస్వతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నాణ్యమైన విద్య కొరకు తన సోదరుడ దివంగత డా.రంగారావు నెలకొల్పిన పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను అభినందించారు...

తన బాల్యం వంగరలో గడిచినట్లు గుర్తు చేసారు..ఇక్కడే శిశు విద్య కొనసాగింది.. నాటి స్మృతులు మదిలో వున్నాయన్నారు...ప్రభుత్వ సహాయ సహకారంతో నిర్వహిస్తున్న ఆశ్రమ కళాశాలలో తల్లిదండ్రులకు దూరంగా ఉపాద్యాయులే తల్లిదండ్రులుగా నాణ్యమైన విద్య పొందడం గొప్ప అవకాశమని తెలిపారు.ఉన్నత లక్ష్యసాధనకు క్రుషి చేస్తే విజయాలు వరిస్తాయని తెలిపారు...ఈ విషయంలో స్వర్గీయ ప్రధాని పి.వి.పేరును శాశ్వతంగా నిలపాలని పిలుపునిచ్చారు.

పి.వి.కుమారుడు ప్రభాకర్ రావు మాట్లాడుతూ పేద ప్రజలకు సమాన విద్యతో పాటు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో నాడు విద్యా మంత్రిగా మొదటి ఆశ్రమ పాఠశాల నల్గొండ సర్వేల్లో ప్రారంభించారని ,

కేంద్ర మానవ వనరుల మంత్రిగా నాటి ప్రధాని రాజీవ్ గాంధీ కోరిక మేరకు దేశవ్యాప్తంగా నవోదయపాఠశాల ఏర్పాటు 1970 నాటి ఆశ్రమ విద్యాలయాల ఏర్పాటుకు మూలం అని వివరించారు. ఇక వంగర గురుకుల పాఠశాల తన సోదరుడు డా.రంగారావు ప్రత్యేక చొరవ... ఆయన బ్రహ్మచారి...కుటుంబ సభ్యులు లేరు కాబట్టి అందరిని కుటుంబ సభ్యులుగా బావించేవారు...

అందుకే భూమిని విరాళంగా ఇచ్చి శాశ్వత భవనాలకు శ్రీకారం చుట్టారు.రంగారావు మానస పుత్రికే ఈ ఆశ్రమ పాఠశాల.కుటుంబీకులుగా పాఠశాలకు అనేక రకాల సాయం చేస్తున్నాము..మాకు కావలసినది ఉన్నత ప్రమాణాలు...పిల్లలు మంచి స్థానంలో నిలబడడం... పి.వి.గారిపేరు నిలబడడం.పి.వి.మనుమడు మనీష్ ఏఐ ప్రాముఖ్యతను వివరించారు...మారుతున్న కాలంతో పోటీ పడాలంటే దానకి అనుగుణంగా విద్యాభిరుచలు పొందాలని అప్పుడు మాత్రమే ఉపాది అవకాశాలు వుంటాయని తెలిపారు.

స్థానిక యస్ఐ దివ్య సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వుండాలని...తెలియని కాల్స్ వచ్చి ఓటిపి ఇతర వివరాలు అడిగితే ఇవ్వరాదని...కోరారు.

ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలల గైడెన్స్ అధికారి తారా సింగ్ , పి.వి.మదన్ మోహన్,పి.వి.శరత్, కళాశాల ప్రిన్సిపాల్ అప్రొజు సుల్తానా ,సీనియర్ పాకల్టి భార్గవి,సిబ్బంది పెరుమాళ్ రవి ,లక్ష్మీకాంత్,వెంకటరెడ్డి, బ్ర.శ్రీ .చతుర్వేది బుచ్చిరెడ్డి,మల్లారెడ్డి,సురేశ్,సుమన్, ప్రభుతులు పాల్గొన్నారు...

## రాయికల్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో

# ఘనంగా గోరింటాకు సంబరాలు




**రాయికల్ మండలం ఆగస్టు,09( రిపబ్లిక్ న్యూస్)**




జగిత్యాల జిల్లా రాయికల్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని, ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటూ ఆనందంగా గడిపారు.గోరింటాకు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థినులు వివిధ రకాల అందమైన గోరింటాకు డిజైన్లను వేసుకుని తమ ప్రతిభను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, సృజనాత్మకత, పరస్పర స్నేహభావం పెంపొందుతాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. విద్యార్థినుల ఉత్సాహం, సందడి మధ్య గోరింటాకు సంబరాలు ఆహ్లాదకరంగా సాగాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం తిరుపతి రావు, ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రావు ఉపాధ్యాయులు తిరుపతి రావు విద్యార్థులు పాల్గొన్నారు.

# అధ్వాన్నంగా రోడ్లు
# అవస్థలు పడుతున్న ప్రజలు

**మల్లాపూర్ ఆగస్టు 9 (రిపబ్లిక్ న్యూస్)**

మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలోని ఐదు మరియు ఆరవ వార్డు ప్రధాన రహదారి పైన పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో చిన్నపాటి వర్షాలకే గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. చౌకీదార్ క్వార్టర్స్ నుండి హసనయ్య మేన్ రోడ్డు వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వాన్నంగా తయారైందని స్థానికులు వాపోయారు. పూర్తిగా గుంతలమయంగా మారిన రోడ్లపై కాలినడకన వెళ్లే ప్రజలకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. తమ గ్రామంలోని రహదారులకు మరమ్మతులు చేయాలని అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేసారు.





## వేంపల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ
## గ్రామ శాఖ కార్యకర్తల సమావేశం

**మల్లాపూర్ ఆగస్టు 9 (రిపబ్లిక్ న్యూస్)**



మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ గ్రామ శాఖ కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా నలిమెల ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా గుగ్లావత్ మహేష్ ను కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్లావత్ రాజేందర్, మిట్టపల్లి దివాకర్ రెడ్డి, వేముల నరేష్, గోపినేని రాజేందర్, రాజ్ యాదవ్ వేల్పుల, రాగెల్లి రాజేశం, వెల్మల రాజశేఖర్, జై గణేష్, భుక్య మహేష్, వేంపల్లి గ్రామ భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

## రామకుప్ప మండలం పరిధిలో ఏనుగులు
## వరి పంటలను ధ్వంసం






**రామకుప్పం మండలం ఆగస్టు 9రిపబ్లిక్ న్యూస్**

రామకుప్ప మండలం పరిధిలో గాంధీనగర్ గ్రామంలో శనివారం రాత్రి మా గ్రామంలో మరియు ముద్దుల వంక గ్రామంలో ఏనుగులు వరి పైరు పంటలను ధ్వంసం చేశాయి

ఈరోజు మా గ్రామాల్లో ఏనుగులు గుంపు సంచరిస్తున్నాయి కావున ఆ గ్రామాల్లో ఏనుగులకు గ్రామస్తులు భయాందోళనకి గురి అవుతున్నారు కావున వెంటనే పై అధికారులు ఫారెస్ట్ సిబ్బంది వెంటనే ఆ గ్రామాలకి వెళ్లే పరిశీలించి నష్టపోయిన రైతులకు ఆర్థికంగా గవర్నమెంట్ నుండి సహాయం అందేది అందించాలని కోరుతున్నాం ఆ గ్రామ ప్రజలకు కూడా కొద్దిగా 6 గంటలకు పైబడి పొలాల దగ్గరికి వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేయాలని తెలియపరుస్తున్నాము



# పత్తి పరిశోధనలో రవీంద్రనాథ్‌ది చెరగని ముద్ర

## రైతు సంక్షేమమే ధ్యేయంగా సాగిన శాస్త్రీయ ప్రస్థానం -గౌరవ డాక్టరేట్ అందుకున్న రవీంద్రనాథ్ కు ఘన సన్మానం..

**నంద్యాల ఆగస్టు 9 (రిపబ్లిక్ న్యూస్) :**
పత్తి పరిశోధనా రంగంలో 36 సంవత్సరాలపాటు విశిష్ట సేవలందించి, దేశవ్యాప్తంగా రైతాంగ అభ్యున్నతికి తన పరిశోధనలను అంకితం చేసిన నంద్యాల పట్టణానికి చెందిన విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ కాదర్‌బాద్ రవీంద్రనాథ్ కు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ అందించడం నంద్యాల ప్రాంతానికే కాకుండా రాయలసీమ రైతాంగానికి గర్వకారణమని పలువురు ప్రముఖులు కొనియాడారు. 90 సంవత్సరాల వయసులో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆదివారం నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో డాక్టర్ రవీంద్రనాథ్‌కు ఘన అభినందన సభ నిర్వహించారు.
నంది రైతు సమాఖ్య అధ్యక్షులు బీవీ రామసుబ్బారెడ్డి, కార్యదర్శి ఎంవీ కృష్ణారెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ సభకు నంద్యాల మాజీ పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి అధ్యక్షత వహించారు. మాతృభాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు సమన్వయకర్తగా వ్యవహరించారు.
పత్తి పరిశోధనలో డాక్టర్ రవీంద్రనాథ్ చేసిన సేవలు అసాధారణమైనవని సభలో పాల్గొన్న ప్రముఖులు పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన పత్తి ప్రాంతీయ పరిశోధనా కేంద్రంలో 1959 నుంచి 1996 వరకు వివిధ హోదాల్లో శాస్త్రవేత్తగా పనిచేసిన ఆయన, తన 36 ఏళ్ల సుదీర్ఘ పరిశోధనా ప్రస్థానంలో 60కి పైగా పరిశోధనా పత్రాలను జాతీయ, అంతర్జాతీయ శాస్త్రీయ పత్రికల్లో ప్రచురించారు. ఆయన అభివృద్ధి చేసిన 'నరసింహ' పత్తి వంగడం భారతదేశంలో హైబ్రిడ్ పత్తి విత్తనాల అభివృద్ధికి మాతృకగా నిలిచిందని వక్తలు గుర్తుచేశారు. నరసింహ విత్తన ఆధారంగా అభివృద్ధి చెందిన హైబ్రిడ్ పత్తి



వంగడాలు దేశంలో కోటి ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సాగవుతున్నాయని పేర్కొన్నారు. పత్తి విత్తనాల వాణిజ్యం ద్వారా ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల పన్ను ఆదాయం సమకూరే స్థాయికి ఆయన పరిశోధనల ప్రభావం విస్తరించడం ఆయన శాస్త్రీయ ప్రతిభకు నిదర్శనమని తెలిపారు.
నరసింహ, అరవింద తదితర పత్తి వంగడాల అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారని, అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన శాస్త్రీయ సాగు పద్ధతులపై దేశంలోని వివిధ ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పించారని పేర్కొన్నారు. ఆకాశవాణి, దూరదర్శన్ కార్యక్రమాల ద్వారా పత్తి సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు విలువైన సూచనలు అందించారని గుర్తుచేశారు.
పత్తి పరిశోధనపై తనకున్న అపార అనుభవాన్ని అంతర్జాతీయ వేదికలపై కూడా పంచుకున్న డాక్టర్ రవీంద్రనాథ్ అనేక దేశాల్లోని విశ్వవిద్యాలయాలు, వ్యవసాయ పరిశోధనా సంస్థల్లో ఉపన్యాసాలు ఇచ్చారని సభలో వివరించారు. యూరోపియన్ దేశాలతో పాటు అమెరికా, బంగ్లాదేశ్ తదితర దేశాల్లోని వ్యవసాయ కేంద్రాలను సందర్శించి అధిక దిగుబడుల సాధనకు అనుసరించాల్సిన శాస్త్రీయ పద్ధతులను వివరించారని తెలిపారు.
రైతాంగానికి, వ్యవసాయ పరిశోధనకు ఆయన చేసిన అపార సేవలకు 2015లో జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారని, అదే ఏడాది రైతు నేస్తం ఫౌండేషన్ వారి ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారాన్ని కూడా అందుకున్నారని పేర్కొన్నారు. ఆయన ప్రతిభకు, సేవలకు దాదాపు 14 ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయని తెలిపారు.
సభలో పాల్గొన్న పోచా బ్రహ్మానందరెడ్డి, బీవీ రామసుబ్బారెడ్డి, ఎంవీ కృష్ణారెడ్డి, డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు, వెంకటరామిరెడ్డి, కల్లూరి రామలింగారెడ్డి, ప్రముఖ న్యాయవాది రామచంద్రారెడ్డి, డాక్టర్ గెలివి సహదేవుడు, శ్రీనిధి రఘువీర్, శ్రీనివాసమూర్తి, శివరామకృష్ణారెడ్డి, డాక్టర్ ఉదయ్ శంకర్, డాక్టర్ ఎన్‌సీ లక్ష్మయ్య, డాక్టర్ కురుమేటి కిషోర్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ రవీంద్రనాథ్ పరిశోధనలు రైతు జీవితాలతో ముడిపడినవని, ప్రయోగశాలలో ప్రారంభమైన ఆయన పరిశోధనలు లక్షలాది రైతుల పొలాలకు చేరి ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చాయని ప్రశంసించారు.
రాయలసీమ వంటి కరవు ప్రాంతంలో రైతాంగానికి శాస్త్రీయ వ్యవసాయ విజ్ఞానాన్ని అందించడం ద్వారా రవీంద్రనాథ్ తనదైన ముద్ర వేశారని, ఆయన ప్రతిభావంతమైన పరిశోధకుడిగా మాత్రమే కాకుండా రైతు నేస్తంగా కూడా గుర్తింపు పొందారని కొనియాడారు. ఇలాంటి మహోన్నత శాస్త్రవేత్త నంద్యాల ప్రాంతానికి చెందినవారు కావడం తెలుగుజాతికి గర్వకారణమని పేర్కొన్నారు.
కార్యక్రమంలో డాక్టర్ గంగుల నాగరాజు, కొప్పుల ప్రసాద్, నీలకంఠమాచారి, మహబూబ్ బాషా, మహమ్మద్ రఫీ తదితర కవులు డాక్టర్ రవీంద్రనాథ్ పరిశోధనా ప్రస్థానాన్ని, రైతాంగానికి ఆయన చేసిన సేవలను కీర్తిస్తూ కవితలు వినిపించారు. మాతృభాషా పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాస రెడ్డి డాక్టర్ రవీంద్రనాథ్ జీవిత విశేషాలను సభకు వివరించారు.
ఈ సందర్భంగా డాక్టర్ కాదర్‌బాద్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ భారతదేశం వ్యవసాయక దేశమని, వ్యవసాయ రంగాన్ని శాస్త్రీయంగా అభివృద్ధి చేసి దేశాన్ని సమున్నతంగా నిలపాలన్నదే తన జీవిత ఆశయమని తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించడం తనకు ఎంతో ఆనందం, సంతృప్తిని కలిగించిందన్నారు. రైతుల ప్రయోజనాలకు ఉపయోగపడే పరిశోధనలు చేయడం, వ్యవసాయ రంగానికి తన వంతు సేవ అందించడం తన జీవితానికి లభించిన గొప్ప సార్థకత అని పేర్కొన్నారు.
అనంతరం పోచా బ్రహ్మానందరెడ్డి నేతృత్వంలో భారతి బీఈడీ కళాశాల, శ్రీశైల పబ్లిక్ స్కూల్ సిబ్బంది డాక్టర్ రవీంద్రనాథ్‌ను ఘనంగా సత్కరించారు. వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు, రైతులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, విద్యావేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.
కార్యక్రమంలో రైతు నాయకులు ఏరువ రామచంద్రారెడ్డి, పోచా రాధాకృష్ణారెడ్డి, శివరామకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఓబులపతి, చంద్రశేఖర్ రెడ్డి నంది రైతు సమాఖ్య సభ్యులు, సాహితీ సంస్థల ప్రతినిధులు, రైతులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
పత్తి పరిశోధనలో ఒక శకాన్ని సృష్టించి, తన విజ్ఞానాన్ని రైతు సంక్షేమానికి అంకితం చేసిన డాక్టర్ కాదర్‌బాద్ రవీంద్రనాథ్‌కు లభించిన గౌరవ డాక్టరేట్ ఒక్క వ్యక్తికి దక్కిన గౌరవం మాత్రమే కాదని, నంద్యాల నేలకు, రాయలసీమ రైతాంగానికి, భారతీయ వ్యవసాయ పరిశోధనకు దక్కిన గౌరవమని సభ ఏకగ్రీవంగా అభిప్రాయపడింది.

# నంద్యాల గైనకాలజీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో అభయ డే నిర్వహణ

- **కోల్ కత్తా ఆర్.జి. కర్ ఆసుపత్రి సంఘటనలో మరణించిన మహిళా వైద్యురాలు జ్ఞాపకార్థం అభయ డేగా నిర్వహణ**
- **దేశవ్యాప్తంగా జాతీయ గైనకాలజీ వైద్యుల సంఘం(ఫాగ్సి) ఆధ్వర్యంలో**
- **విధి నిర్వహణలో ఉండే మహిళా వైద్య సిబ్బంది రక్షణ కోసం భద్రతా దినం గా నిర్వహణ**
- **జాతీయ వైద్యుల రక్షణ చట్టం కావాలి. ఆంధ్రప్రదేశ్ వైద్య సిబ్బంది రక్షణ చట్టం కఠిన తరం చేయాలిం**

**: నంద్యాల గైనకాలజీ వైద్యుల సంఘం విజ్ఞప్తి**




**నంద్యాల ఆగస్టు 9 (రిపబ్లిక్ న్యూస్) :**
నంద్యాల ప్రసూతి ,స్త్రీ వ్యాధి వైద్యుల సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అభయ డే కార్యక్రమాన్ని సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నాగమణి, డాక్టర్ వసుధ, కోశాధికారి డాక్టర్ సునీతల ఆధ్వర్యంలో నిర్వహించారు.
ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ 2024లో కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో జరిగిన మహిళా వైద్యురాలి హత్య ఘటన అనంతరం వైద్య సిబ్బంది భద్రతపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ ప్రారంభమైందన్నారు. ఆసుపత్రులలో వైద్యులు,నర్సులు, ఇతర ఆరోగ్య రక్షణ సిబ్బందిపై జరుగుతున్న భౌతిక దాడులను ఖండించడంతో పాటు, విధులు నిర్వహించే సమయంలో వారికి భద్రత కల్పించాలనే ఉద్దేశంతో అభయ దేను దేశవ్యాప్తంగా జాతీయ గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సేవలు అందించే వైద్య సిబ్బంది భయాందోళనలకు గురికాకుండా విధులు నిర్వర్తించేలా సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలపై, సమాజంపై ఉందన్నారు.
ఆరోగ్య సిబ్బందిపై హింసకు తావులేకుండా సమాజంలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో వైద్య సిబ్బంది రక్షణ చట్టం సత్వరమే తీసుకురావలసిన అవసరం ఉందన్నారు. ఆసుపత్రుల్లో వైద్యం పొందుతూ రోగి మరణించిన సందర్భంగా కానీ, ఏదైనా ఇబ్బంది తలెత్తిన సమయంలో రోగి బంధువులు ఫిర్యాదు చేసినప్పుడు పోలీసు శాఖ సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా అనుసరించాల్సిన నిర్దిష్ట విధివిధానాలు రూపొందించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయాలని కోరారు.
గైనకాలజీ వైద్యుల సొసైటీ కార్యక్రమానికి సంఘీభావం తెలపడానికి సమావేశంలో పాల్గొన్న ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వైద్య సిబ్బంది 2008 రక్షణ చట్టాన్ని సవరించి, వైద్య సిబ్బందిపై భౌతిక దాడులకు పాల్పడిన వారికి ఇప్పుడు ఉన్న రెండు సంవత్సరాల కారాగార శిక్షను ఏడు సంవత్సరాలకు పెంచి నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయడానికి అనువుగా కఠిన తరం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నంద్యాల గైనకాలజీ వైద్యుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నాగమణి, డాక్టర్ వసుధ రాణి, కోశాధికారి డాక్టర్ సునీత, ఐఎంఏ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, నంద్యాల మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, డాక్టర్ నర్మద, డాక్టర్ కల్పన, డాక్టర్ నాగ రేఖ,డాక్టర్ అరుణ కుమారి,డాక్టర్ శిల్ప,డాక్టర్ శశి కిరణ్, డాక్టర్ దివ్య తేజ, డాక్టర్ గింజుపల్లి అనూష పాల్గొన్నారు.

# సేవా మార్గంలో అందరి చెంతకు

### -విశ్వ హిందూ పరిషత్



**నంద్యాల ఆగస్టు 9( రిపబ్లిక్ న్యూస్) :**విశ్వ హిందూ పరిషత్ సేవా విభాగం ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలుగా ప్రతి నెలా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక అరుంధతి నగర్ లో ఆదివారం నాడు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్టు జగజ్జనని ప్రఖండ అధ్యక్షులు సుహాసిని రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సేవలు అందించిన డా: నీలా ప్రసాద్ యాదవ్ (లక్ష్మి ప్రియ గ్యాస్ట్రో సర్జికల్స్) మరియు డా: క్రాంతి కిరణ్ ను (కిరణ్ ఆర్థోపెడిక్ సెంటర్) ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి నంద్యాల బ్లడ్ సెంటర్ అధినేత అచ్చు గారిని నగర సేవా విభాగం సభ్యులు సన్మానించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరం లో 150 మంది వైద్య సేవను పొందారని , వైద్య సేవతో పాటుడ. యువతి యువకులకు అవసరమైన ఉపాధికి సంబంధించిన శిక్షణను ఇవ్వటానికి కూడా విశ్వ హిందూ పరిషత్ సేవా విభాగం ప్రయత్నాలు చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ కార్యదర్శి నాగిరెడ్డి, విశేష సంపర్క ప్రముఖ్ శేషసాయి, డా లలిత సరస్వతీ , నరాల అరుణ , సుకుమాంబ , సేవా విభాగం సభ్యులు గురవయ్య ,శివ శంకర్ రెడ్డి, ఆదినారాయణ, చింతలపల్లి వాసు, మురళీధర్ రెడ్డి , నరసింహ, లక్ష్మీ నరసింహ , రవి , గౌతమ్ , సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్లో ఫ్రెండ్షిప్ కప్ క్రికెట్ టోర్నమెంట్

### విజేతగా షావల్ క్రికెట్ జట్టు

**నంద్యాల ఆగస్టు 9( రిపబ్లిక్ న్యూస్) :**
బాబా నగర్ సమీపంలోని గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్లో అట్టహాసంగా ఫ్రెండ్షిప్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ని నిర్వహించారు. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి పాల్గొన్నారు. గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఫ్రెండ్షిప్ కప్ క్రికెట్ టోర్నమెంట్ లో జట్టు ఉత్సాహంగా పాల్గొన్నాయి. క్రికెట్ టోర్నమెంట్లో షావల్ జట్టు, సుబ్బా రావు జట్లు తలపడగా హోరా హోరీగా సాగిన క్రికెట్ టోర్నమెంట్ లో షావల్ జట్టు విజేతగా నిలిచింది విజేత జట్టుకు డైరెక్టర్ మౌలాలి రెడ్డి బహుమతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు.



సిబ్బంది మానసిక ప్రశాంతత మంచి ఆరోగ్యాన్ని కలిగించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్సాహభరమైన టోర్నమెంట్ నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉంటామని తెలిపారు.



# నేడు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ



**నంద్యాల బ్యూరో, ఆగస్టు 09 (రిపబ్లిక్ న్యూస్):**జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో 10వ తేదీ (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్)" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా కార్యక్రమంలో సమర్పించవచ్చుని, అలాగే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చుని వివరించారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com